పేజీలు :12
వెల :5/-
జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com
# మీడియా టుడే
మన మీడియా - మన సమాజం
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham
సంపుటి : 01 సంచిక : 164 ఆదివారం 29-3-2026 పేజీలు 12 వెల 5/-

# సంగతి తేలుస్తాం

## ఇసుక మాఫియాలో హరీశ్ రావు తమ్ముడు మహేశ్ రావు

**ఏపీ మాజీ ఎమ్మెల్యేను బెదిరించి మైనింగ్ లీజు రాయించుకున్నారు**

**నేరెళ్ల ఇసుక మాఫియాలో సంతోష్ రావు తండ్రి రవీందర్ రావు**

**గంగుల కమలాకర్‌కు చెందిన శ్వేత గ్రానైట్స్‌లోనూ అక్రమ మైనింగ్**

**వద్దిరాజు రవిచంద్రను బెదిరించి గాయత్రీ గ్రానైట్స్ రాయించుకున్నారు**

**ఇప్పటిదాకా జరిగిన ఇసుక, మైనింగ్ లీజులపై సీబీసీఐడీ విచారణ**

**సీఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు**



**హైదరాబాద్, మార్చి 28: మీడియా టుడే**
తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి (2014, జూన్ 2) నుంచి నేటి వరకూ ఇచ్చిన మైనింగ్ లీజులు, ఇసుక తవ్వకాల్లో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో సీబీసీఐడి విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. విచారణలో నిజాలను నిగ్గు తేల్చి.. వచ్చే శాసనసభ సమావేశాల్లో బయట పెడతామన్నారు. శాసనసభలో శనివారం ఆయన మాట్లాడారు. "మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తమ్ముడు మహేశ్ రావు ఇసుక మాఫియా నడిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఓ మాజీ ఎమ్మెల్యేకు శిరీషా జీయో గ్రానెట్స్ కంపెనీ ఉండేది. అప్పట్లో మైనింగ్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు ఆ మాజీ ఎమ్మెల్యేను బెదిరించారు. ఆ కంపెనీ మైనింగ్‌ను బలవంతంగా లీజుకు రాయించుకున్నారు. అక్రమ మైనింగ్ చేశారు. దానిపై విచారణ చేయిస్తాను" అని సభలో ప్రకటించారు. రెవెన్యూ మంత్రిని బెదిరించేందుకు యత్నిస్తున్న హరీశ్‌రావు.. తన తమ్ముడైన మహేశ్ రావు పేరుమీద అక్రమంగా మైనింగ్ చేసుకున్నారని, దానిపై కూడా విచారణ జరిపిస్తామన్నారు. "సిరిసిల్ల నియోజకవర్గంలోని నేరెళ్ల ఇసుక బాధితులైన దళితులను లారీ ఎక్కించి, తొక్కించి, చంపించి, ఇసుక అక్రమ రవాణా చేసిన జోగినిపల్లి సంతోష్ రావు తండ్రి రవీందర్‌రావుకు సంబంధించిన ఇసుక మాఫియాపై విచారణ జరిపించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు చెందిన శ్వేత గ్రానైట్స్‌లో అక్రమ మైనింగ్ జరిగింది. దానిపై రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు ఈడీ ఎంక్వైరీ జరిగింది. శ్వేత గ్రానైట్స్‌పై కూడా విచారణకు ఆదేశిస్తున్నాం. వద్దిరాజు రవిచంద్రకు చెందిన గాయత్రీ గ్రానైట్ కంపెనీకి నోటీసులిచ్చి.. జరిమానా విధించి.. లొంగదీసుకుని, ఆయన గ్రానైట్‌ను బలవంతంగా రాయించుకున్నారు. దానిపై కూడా విచారణ జరిపిస్తాం" అని సీఎం ప్రకటించారు. అధికారంలో ఉన్నప్పుడు హరీశ్‌రావు, కేటీఆర్ ఇసుక దోపిడీకి పాల్పడ్డారని, ఆ మాఫియాకు నాయకత్వం వహించింది వారిద్దరేనని ఆరోపించారు. "మైనింగ్ శాఖ తొలుత హరీశ్ దగ్గర ఉండేది. ఆయన అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారని కేసీఆర్ ఆ శాఖను తొలగించారు. కొడుకు, అల్లుడి మధ్య పంచాయితీ కారణంగా ఆ శాఖను కేటీఆర్‌కు అప్పగించారు. వారి అక్రమాలను బయటకు తీస్తాం" అని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఐదేళ్లపాటు హరీశ్, కేటీఆర్ ఆ శాఖను తీసుకుని, వేలాది కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ఇప్పుడు మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు అప్పట్లో ఇసుక మాఫియాలో భాగస్వాములని చెప్పారు. వారి పదేళ్ల దోపిడీ ప్రజలకు అర్థమవుతుందని బెంబేలెత్తుతున్నారని వ్యాఖ్యానించారు. ఇసుక, లీజు మాఫియా, జరిమానాలు వేసి.. ఆ తర్వాత తగ్గించి వారిని పార్టీలోకి తీసుకున్న ఉదంతాలపై విచారణ చేయిస్తామని, ఒక్కొక్కరి సంగతి తేలుస్తామని సీఎం హెచ్చరించారు.

**రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీపైనా విచారణ**
ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడ గండిపడినా, ఎలాంటి తప్పిదాలు జరిగినా ఎవర్నీ ఉపేక్షించబోమని సీఎం రేవంత్ హెచ్చరించారు. అందరి నిగ్గు తేలుస్తానన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిచర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీపైనా సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. "రాఘవ కన్‌స్ట్రక్షన్ నుంచి సీనరేజీ చార్జీ కింద రూ. 1,52,97,825.. పర్మిట్ ఫీజు కింద రూ. 1,22,25,446 ప్రభుత్వం కట్టించుకుంది. ఇది ఏదో బీఆర్‌ఎస్ నేతలు కనిపెట్టి వారు ఫిర్యాదు చేస్తే తీసుకున్న చర్య కాదు. ప్రభుత్వమే స్వయంగా వివరాలు సేకరించింది. ఆ సంస్థకు నోటీసులి చ్చింది. దాని నుంచి సర్కారుకు రావాల్సిన బకాయిలను రాబట్ట డమే కాకుండా, తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చాం" అని వివరించారు. ఇందులో విపక్షం ఫిర్యాదు లేదని, మరెవరో చెప్ప లేదని, ఉద్దేశపూర్వకంగా ఒక మంత్రిపై బురదజల్లాలని, అక్కసు వెళ్లగక్కాలని, వారు అనుకున్న పైరవీలకు ఆ మంత్రి సహకరించడం లేదని ఆయనపై ఒత్తిడి తీసుకువచ్చి బ్లాక్‌మె యిల్ చేయాలనుకున్నారని ఆరోపించారు. ఇటువంటివి ఇంకెక్క డైనా జరుగుతాయేమో కానీ, తమ ప్రభుత్వంలో సాగవని, అటువంటి బ్లాక్ మెయిల్‌కు ప్రభుత్వం భయపడబోదని స్పష్టం చేశారు.

# పెట్రో ధరల నియంత్రణకే ఎక్సైజ్ సుంకం తగ్గింపు

## లాక్‌డౌన్ సమస్యే ఉత్పన్నం కాదు: కిషన్‌రెడ్డి



**హైదరాబాద్ మార్చి 28 మీడియా టుడే**
అంతర్జాతీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, మనదేశంలో ప్రస్తుత ధరలు మరింత పెరగకుండా ఉండేందుకే కేంద్రం వాటిపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. వాహనదారులకు నేరుగా ప్రయోజనం కలగకున్నా, కంపెనీలపై అదనపు భారం పడకుండా ఉండాలన్న ఉద్దేశం కూడా ఎక్సైజ్ సుంకాల తగ్గింపునకు కారణమన్నారు. దేశంలో అవసరాలకు అనుగుణంగా రిఫైనింగ్ సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు వెల్లడించారు. శనివారం కవాడిగూడలోని సీజీవో టవర్స్ పీఐబీ కార్యాలయంలో ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్లతో కిషన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం పెట్రో డీలర్లకు 3 రోజుల క్రెడిట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని, దీంతో వారిపైనా ఆర్థికభారం పడకుండా ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో లాక్‌డౌన్ సమస్యే ఉత్పన్నం కాబోదని స్పష్టం చేశారు. డీజిల్ వినియోగం తగ్గించేందుకు ఈవీ వాహనాలను, ఎలక్ట్రికల్ రైళ్లను పెంచుతున్నట్లు తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ల కోసం ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పెట్రోలు, డీజిల్‌పై దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలోనే అత్యధిక వ్యాట్ (35.20శాతం) వసూలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో వ్యాట్ 29శాతమే ఉందని చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఇష్టారాజ్యంగా వ్యాట్ వసూలు చేసిందని, ప్రస్తు త కాంగ్రెస్ కూడా నయాపైసా తగ్గించలేదని ఆయన ఆరోపించారు.

## 'మూసీ'పై ఉప సంఘం ఏర్పాటు చేస్తూ జీవో జారీ

**హైదరాబాద్, మార్చి 28 మీడియా టుడే**
మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రి మండలి ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ సీఎస్ కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సభ్యులుగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ వ్యవహరిస్తారని, కమిటీ కన్వీనర్‌గా మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఎండీ ఉంటారని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు అవసరమైన మార్గదర్శకాలను సూచించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం, సమయానుకూల సమీక్షల కోసం ఈ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నదీ పునరుజ్జీవం, మురికినీటి నిర్వహణ, వరదల నియంత్రణ, భూసేకరణ, పునరావాసం, ఆర్థిక వనరులు వంటి వ్యవహారాలపై ఈ కమిటీ దృష్టి సారించనుంది. నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టు మొత్తం పూర్తయ్యేలా చూసే బాధ్యత ఈ కమిటీదేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# మీరు రావద్దు, ప్రధాని పదవి పోతుందన్నారు..

## నొయిడా సెంటిమెంట్‌పై మోదీ



**నొయిడా,మీడియా టుడే**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా నొయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని శనివారంనాడు ప్రారంభించారు. గత పాలకులు మూఢనమ్మకాలతో నొయిడా అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శించారు. నొయిడాలో పర్యటిస్తే అది నాయకుల కెరీర్‌కు అపశకునంగా మారుతుందనే ప్రచారం చాలా కాలంగా ఉందని, అయితే తాను మాత్రం దీనిని పట్టించుకోలేదని చెప్పారు. 'మూఢనమ్మకాల కారణంగానే నొయిడాను నాయకులు పట్టించుకోలేదు. గత పాలకులు ఇక్కడకు వస్తే పదవి కోల్పోతామని భయపడుతుండేవారు. అందుకే నొయిడాకు రావడం మానేశారు' అని మోదీ చెప్పారు. తనకు వ్యక్తిగతంగా ఎదురైన అనుభవాన్ని ఈ సందర్భంగా పంచుకున్నారు. 'నాకు గుర్తుంది. సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నొయిడాకు వచ్చేందుకు ప్లాన్ చేసుకున్నాను. దీంతో సీఎం ఆందోళన చెందారు. కార్యక్రమానికి ఆయన దూరంగా ఉండటమే కాకుండా నన్ను కూడా రావద్దని చెప్పారు. మోదీజీ... నొయిడా వెళ్లకండి.. ఇప్పుడే మీరు ప్రధానమంత్రి అయ్యారని సూచించారు. అయితే నేను నొయిడా ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తానని, అదే తనకు దీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశం ఇస్తుందని ఆయనతో చెప్పాను' అని మోదీ తెలిపారు. ఒకప్పుడు నాయకులు వదిలేసిన ఈ ప్రాంతమే ఇప్పుడు ప్రపంచ నాయకులను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉందని, స్వయం సమృద్ధి, నిర్భర భారత్‌కు గర్వకారణంగా నిలిచిందని ప్రధాని ప్రశంసించారు. అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి నొయిడా వెళ్లి వస్తే పదవి కోల్పోతారని మూఢనమ్మకం ఒకటి మూడు దశాబ్దాలుగా కొనసాగుతోంది. 1988లో ముఖ్యమంత్రి వీర బహదూర్ సింగ్ నొయిడా వెళ్లి తిరిగి వచ్చిన కొద్దిరోజులకే తన పదవిని కోల్పోయారు. నొయిడాకు వెళ్లివచ్చిన తర్వాత పదవి కోల్పోయిన వారిలో 1989లో ఎన్డీ తివారీ, 1995లో ములాయం సింగ్ యాదవ్, 1997లో మాయావతి, 1999లో కల్యాణ్ సింగ్ ఉన్నారు.

# పొంగులేటి రాజీనామా చేయాలి

**కొత్వాల్‌గూడ వద్ద మంత్రికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్**

**అసెంబ్లీలో హరీశ్‌రావు ధ్వజం**



**హైదరాబాద్, మార్చి 28 మీడియా టుడే**
రాష్ట్రంలో కంచే చేను మేస్తే.. అన్నట్లుగా మంత్రులే అక్రమాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎ?సఎల్పీ ఉపనేత హరీశ్‌రావు అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ.. ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలో శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలోని జీవో 111 ప్రాంతంలో ఎలాంటి మైనింగ్, పర్యావరణ అనుమతుల్లేకుండా అక్రమ మైనింగ్ చేస్తోందని ఆరోపించారు. మినరల్ డీలర్ లైసెన్స్, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు, కనీసం రిజిస్ట్రేషన్ కూడా లేకుండా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని తెలిపారు. సీనరేజ్ చెల్లించకుండా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని, విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకోలేదని, డీజిల్ జనరేటర్లతోనే భారీ ఎత్తున మైనింగ్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం శాసనసభలో మైనింగ్ పద్దులపై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రి పొంగులేటిపె తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. విపక్ష బీఆర్‌ఎస్ సభ్యులు పట్టుబట్టిన 'హౌస్ కమిటీ' డిమాండ్, అధికార పక్షం ఇచ్చిన గట్టి కౌంటర్లతో సభ స్తంభించింది. మూసీని ప్రక్షాళన చేస్తానంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లను తొలగిస్తున్నారని, కానీ.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్‌తో మూసీ నది, గండిపేట, హిమాయత్‌సాగర్ కలుషితం అవుతున్నాయని మైనింగ్ అధికారులు చెప్పినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. మరోవైపు పటాన్‌చెరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తమ్ముడికి చెందిన స్టోన్‌క్రషర్ యూనిట్‌లో చిన్న తప్పు జరిగిందంటూ రాత్రికి రాత్రే అరెస్టు చేసి నెలరోజులు జైల్లో పెట్టారని గుర్తుచేశారు.

**పదేళ్లలో అక్రమ మైనింగ్‌పైనా విచారణ..**
హరీశ్‌రావు ఆరోపణలను అధికార పక్షం మూకుమ్మడిగా తిప్పికొట్టింది. మంత్రులు, ఎమ్మెల్యేలు వరుసగా విపక్షంపై విరుచుకుపడ్డారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కంపెనీ తప్పుచేస్తే.. పై అధికారికి ఫిర్యాదు చేయాలని, ఒకే కంపెనీపై సభలో మాట్లాడటం సరైంది కాదని అన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ.. అక్రమ క్రషర్లపై చర్యలకు ఆదేశించామన్నారు. అయితే క్రిమినల్ కేసులు పెట్టి, జైల్లో పెట్టాలని చట్టం చెబుతోందని హరీశ్ పేర్కొన్నారు. దీంతో వ్యక్తిగతంగా ఒకే కంపెనీ గురించి మాట్లాడటం సరైంది కాదని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. పదేళ్లలో ఇసుక దందా, మైనింగ్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని మంత్రి వివేక్ అన్నారు. రా?ఘవ కంపెనీలో మంత్రి పొంగులేటి పేరు లేదని, ఆయనపై తప్పుడు వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని శ్రీధర్‌బాబు అన్నారు. హరీశ్‌రావు వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని పట్టుబట్టారు. దీంతో కాంగ్రెస్ సభ్యులంతా లేచి హరీశ్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. స్పీకర్ కూడా ఇవే సూచనలు చేసినా హరీశ్‌రావు వినకుండా 'హౌస్ కమిటీ' వేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ సభ్యులంతా స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి.. వెల్‌లో కూర్చొని నినాదాలు చేశారు. చివరికి హరీశ్‌రావు వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అయినా.. బీఆర్‌ఎస్ సభ్యులు నిరసన కొనసాగించడంతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఇసుక రవాణా, క్వారీ వివాదాల నేపథ్యంలో దళితులపై దాడులు, పోలీసుల హింస పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలోనే జరిగాయన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఇసుక మాఫియా వల్ల దళితుల ప్రాణాలు పోతున్నా.. అప్పట్లో హౌస్ కమిటీ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. గంగుల కమలాకర్ మైనింగ్‌పైనా విచారణ జరిపించాలన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి మైనింగ్ అక్రమాలపై విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటకు వస్తాయన్నారు.

# తమిళనాట 164 స్థానాల్లో డీఎంకే పోటీ

## తండ్రి సమాధి వద్ద నివాళులర్పించి, అభ్యర్థులను ప్రకటించిన సీఎం స్టాలిన్



**చెన్నై, మార్చి 28 మీడియా టుడే**
తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటికే మిత్రపక్షాలకు సీట్లు కేటాయించిన అధికార డీఎంకే పార్టీ 164 స్థానాల్లో పోటీ చేయనుంది. ఆ పార్టీ అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం తమ పార్టీ అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. శనివారం సాయంత్రం ఆయన పార్టీ కార్యాలయంలో 164 మంది అభ్యర్థులతో జాబితాను వెల్లడించిన అనంతరం... నేరుగా స్థానిక మెరీనాలో ఉన్న తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి సమాధి వద్దకు వెళ్లి, నివాళులర్పించి.. అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. ఆయన వెంట పలువురు సీనియర్ నేతలు కూడా వున్నారు. ఇప్పటికే స్టాలిన్ 16 పార్టీలతో కూడిన తమ కూటమిలో సీట్ల కేటాయింపు పూర్తి చేశారు. శనివారం ఆయా పార్టీలకు స్థానాలు కూడా ఖరారు చేశాక, తమ పార్టీ అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఇదిలా వుండగా గతంలో మూడుసార్లు విజయం సాధించిన కొళత్తూరు నియోజకవర్గం నుంచే స్టాలిన్ మళ్లీ పోటీ చేయనున్నారు. చెపాక్ నియోజకవర్గం నుంచి ఆయన కుమారుడు, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి మళ్లీ బరిలోకి దిగనున్నారు. దివంగత సినీ నటుడు విజయకాంత్ సతీమణి ప్రేమలత నేతృత్వంలోని డీఎండీకేకు డీఎంకే కూటమిలో 10 స్థానాలు దక్కాయి. విరుదాచలం నియోజకవర్గం నుంచి ప్రేమలత, విరుదునగర్ నుంచి ఆమె కుమారుడు విజయ ప్రభాకర్ పోటీ చేయనున్నట్టు డీఎండీకే ప్రకటించింది. అదేవిధంగా ప్రముఖ సినీ నటి, బీజేపీ నాయకురాలు ఖుష్బూ భర్త, సినీ దర్శకుడు సుందర్.సి 'పుదియనీది కట్చి' పార్టీ తరఫున మదురై సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. పుదియనీది కట్చి అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమిలో వున్న విషయం తెలిసిందే.

**చెన్నైలో రూ.5 కోట్ల నగదు స్వాధీనం**
చెన్నై మధురవాయల్‌లో వాహనంలో తరలిస్తున్న రూ.5 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం మధురవాయల్‌లో తనిఖీలు చేపట్టిన అధికారులు.. ఓ వాహనంలో తరలిస్తున్న రూ.5 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా.. ఈ నగదు ప్రభుత్వ మద్యం దుకాణాలకు సంబంధించినదని, ఆ వాహన సిబ్బంది చెప్పారు.

# అయోధ్య మహాయజ్ఞంలో భారీ అగ్నిప్రమాదం..


## కాలి బూడిదైన యజ్ఞ మండపం



**లక్నో: మీడియా టుడే**
అయోధ్య లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సరయూ నది తీరంలోని బస్తీ ఘాట్ వద్ద శనివారం నిర్వహించిన శ్రీ లక్ష్మీనారాయణ మహాయజ్ఞంలో ఈ ప్రమాదం సంభవించింది. ఉత్తరప్రదేశ్ మంత్రి దయా శంకర్ సింగ్ ఈ మహాయజ్ఞం నిర్వహించారు. తొమ్మిదోరోజు పూర్ణాహుతి పూర్తయిన కొద్ది గంటలకే ప్రమాదం చోటుచేసుకోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా విస్తరించడంతో యజ్ఞ మండపం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఆరు అగ్నిమాపక శకటాలు హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపులోనికి తెచ్చాయి. మంటలు విస్తరించక ముందే వందలాది మంది భక్తులు అక్కడ నుంచి బయటపడటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ముగ్గురు గాయాల బారిన పడటంతో వారిని ఆసుపత్రికి తరలించారు. బలమైన గాలుల కారణంగానే మంటలు వేగంగా విస్తరించినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. యజ్ఞకుండంలోని నిప్పురవ్వలు ఎగసి పడటంతో మండపానికి మంటలు అంటుకున్నట్టు చెబుతున్నారు. అయితే ప్రమాద కారణాలు వెంటనే తెలియలేదు. దీనిపై దర్యాప్తు జరుపుతున్నట్టు అధికారులు చెప్పారు.

# ప్రజా ప్రతినిధులారా ! సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోండి

## ప్రజలకు ఆదర్శంగా నిలవండి - కేంద్రమంత్రి బండి సంజయ్



**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 28 :**
శనివారం కరీంనగర్‌లోని తన నివాసం పై నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్యానెల్స్ సిస్టమ్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంబి,ంచారు. అనంతరం ఆయన మీడియాతో ప్రజాప్రతినిధుల నుద్దేశించి మాట్లాడుతూ మీ ఇండ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకోండిప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించండి.కోటి ఇండ్లల్లో సోలార్ వ్యవస్థ ఏర్పాటే మోదీ సర్కార్ లక్ష్యంసోలార్ ప్యానెల్ పై సబ్సిడీతోపాటు 80 శాతం లోన్ వస్తుంది.పేదలకు సైతం భారం లేకుండా సోలార్ ను ఏర్పాటు చేసుకునే వీలుందివిద్యుత్ కొనే స్థాయి నుండి అమ్మే స్థాయికి రావాలి.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు. కరీంనగర్ లోని తన నివాసంపై సోలార్ ప్యానల్ ను ఏర్పాటు చేసుకున్న కేంద్ర మంత్రి.అధికారులతో కలిసి సోలార్ ప్యానెల్ ను పరిశీలించిన బండి సంజయ్..రాష్ట్రంలోని వార్డు మెంబర్ మొదలు సర్పంచ్ దాకా, కౌన్సిలర్ మొదలు కార్పొరేటర్ దాకా ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి తమ తమ ఇండ్లపై సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కోటి ఇండ్లపై సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయడమే మోదీ సర్కార్ లక్ష్యమన్నారు. అందుకోసం రూ.75 వేల కోట్లకుపైగా నిధులను కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ సోలార్ వ్యవస్థపై పూర్తిస్తాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.ప్రధాని మోదీ పిలుపు మేరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తన నివాసంపై సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకున్నారు. శనివారం టీజీరెడ్కో అధికారులు, డిస్ట్రిబ్యూటర్ తో కలిసి సోలార్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు రూపొందించిన 'ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఏమన్నారంటే:ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు నా ఇంటిపై సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. నిత్యం ఈ దేశాన్ని కాపాడాలి. దేశ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే మహానేత మోదీ. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల కోసం..ముఖ్యంగా చిట్ట చివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందించాలనే అంత్యోదయ సిద్ధాంతంతో పనిచేస్తున్నారు. అందులో భాగంగానే దేశంలోని కోటి ఇండ్లపై సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసి ఉచితంగా విద్యుత్ ను అందించాలనే లక్ష్యంతో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, పథకాన్ని 2024 ఫిబ్రవరి 15న ప్రవేశపెట్టినం. ఈ సోలార్ ప్యానల్ ద్వారా ఒక్కో ఇంటికి నెలకు 300 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్ ను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకోసం 75 వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించినం. తొలుత ప్రజాప్రతినిధులంతా తమ ఇళ్లపై సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలని మోదీ పిలుపునిచ్చారని తెలిపారు.

# కోదాడ పట్టణంలో పోలీసు అధ్వర్యంలో హెల్మెట్ వినియోగం పై అవగాహన ర్యాలీ

## హెల్మెట్ ధరించి ప్రమాదాలలో రక్షణ పొందండి.. కోదాడ డివిజనల్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి

**కోదాడ, మార్చి 28 (మీడియా టుడే)-:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణంలో కోదాడ పట్టణ పోలీసులు ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ వినియోగం పై అవగాహన ర్యాలీని నిర్వహించడం జరిగినది. కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని కోదాడ సబ్ డివిజనల్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్ తో కలిసి ప్రారంభించారు. ర్యాలీ ఖమ్మం క్రాస్ రోడ్డు నుండి రంగా థియేటర్ క్రాస్ రోడ్డు వరకు నిర్వహించి స్థానిక ప్రజలకు, వాహనదారులకు, స్థానిక వ్యాపారులకు హెల్మెట్ వినియోగం పట్ల అవగాహన కల్పించారు. ర్యాలీ నందు పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పౌరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదాడ డివిజన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల అనుకోని రోడ్డు ప్రమాదాలలో ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చునని సూచించారు. ద్విచక్ర వాహనంపై కూర్చునే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత హెల్మెట్ వినియోగం అవగాహన ర్యాలీని నిర్వహించామని తెలిపారు. ప్రతి



పౌరుడు, ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాల పట్ల, సురక్షిత ప్రయాణం పట్ల, రహదారుల వినియోగం పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రజలకు రోడ్డు నియమాల పట్ల, జాగ్రత్తల పట్ల విస్తృతంగా అవగాహన కల్పిస్తుందని ప్రజలు వాహనదారులు గమనించాలని కోరారు. వాహనదారులు వాహనాలు నిదానంగా నడపాలని అన్నారు.ఈ ర్యాలీ నందు పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, పట్టణ ఎస్ఐ సుధీర్, పోలీసు సిబ్బంది స్థానిక పౌరులు పెద్దలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- జిల్లాలో సగటున 50 రోజులు కూడా పనులు కల్పించలేకపోయారు
- సిఎం రేవంత్ రెడ్డి లాగుల తొండలు విడుస్తా అనడం విడ్డూరం
- బడ్జెట్లో ఈ పథకానికి రూ .95,692 కోట్లను కేటాయించాం
- ప్రతి ఒక్కరికీ 125 రోజులు పని కల్పించండి
- అంకిరెడ్డిపల్లె, ముస్తాబాద్ లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- కేంద్ర మంత్రి హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ , బండి సంజయ్




**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ . మీడియా టుడే , మార్చి 28**
ఏటా 125 రోజులపాటు పని కల్పించాలనే లక్ష్యంతో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వీబీజీ రామ్ జీ పథకాన్ని తీసుకొచ్చినా, తెలంగాణలో ఆశించిన విధంగా పని దినాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని, సిఎం రేవంత్ రెడ్డి లాగుల తొండలు విడుస్థా అనడం విడ్డూరంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి , కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, బండి సంజయ్ కుమార్ అన్నారు. సిరిసిల్ల జిల్లాలో 92 వేల జాబ్ కార్డులుంటే సగటున 50 రోజులలోపు మాత్రమే పని కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరికి ఏటా 125 రోజుల పని కల్పించేలా ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులను కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం రోజు సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డి పల్లె గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.25 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముస్తాబాద్ లో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు అంకిరెడ్డిపల్లెలో ఛత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లడుతూ...దేశవ్యాప్తంగా శ్రీరామనవమి ఉత్సవాలను ధార్మిక చింతనతో నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. ఏ గ్రామం వెళ్లినా, ఏ ఆలయం వెళ్లినా సీతారామచంద్రస్వామి కళ్యాణ వేడుకలతో కళకళలాడాయి తంగళ్లపల్లి మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో రూ.25 లక్షల నిధులతో, ముస్తాబాద్ అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉంది.జాతీయ ఉపాధి హామీ పథకం కింద గత ఏడాది నా పార్లమెంట్ నియోజకవర్గంలో 32 కోట్ల 13 లక్షల రూపాయలు ఖర్చు చేసి రోడ్లను నిర్మించినం. మొత్తంగా చూస్తే ఇప్పటి వరకు దాదాపు 700 కోట్ల రూపాయల నిధులను మన పార్లమెంట్ పరిధిలో ఖర్చు చేసినం. ఈసారి ( 2026-27) కేంద్ర బడ్జెట్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకొచ్చిన వి వి బి - జీ రాం జీ (ఎదీ-+ =ూవీ +) పథకానికి 95 వేల 692 కోట్లను కేటాయించినం. గ్రామీణాభివృద్ధి శాఖ బడ్జెట్ లో ఈ ఒక్క పథకానికే 40 శాతం నిధులు కేటాయించినం. మన తెలంగాణ విషయానికొస్తే... ఈ పథకం కింద 3 వేల కోట్లకుపైగా నిధులు వచ్చే అవకాశముంది. రాష్ట్రంలో సుమారు 32 లక్షల జాబ్ కార్డ్ హోల్డర్లు ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. ఏటా 125 రోజులపాటు పని కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చినం. కానీ తెలంగాణలో ఆశించిన విధంగా పని దినాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతున్నారు ముఖ్యంగా సిరిసిల్ల జిల్లాలో ఆశించిన స్థాయిలో పనిదినాలు కల్పించలేకపోతున్నారు. ఈ జిల్లాలో 92 వేల జాబ్ కార్డులుంటే సగటున 50 రోజులలోపు మాత్రమే పని కల్పిస్తున్నారు. 6 వేలలోపు కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పని దినాలు కల్పించారు. ప్రతి ఒక్కరికి ఏటా 125 రోజుల పని కల్పించేలా ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులను కోరుతున్నా... ఈ పథకానికి అయ్యే వ్యయంలో 60 శాతం నిధులను కేంద్రం ఎప్పటికప్పుడు రిలీజ్ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను సైతం జాప్యం లేకుండా 40 శాతం నిధులను విడుదల చేయాలని కోరుతున్నా. పంచాయతీలకు, మున్సిపాలిటీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నయాపైసా ఇయ్యడం లేదు. కానీ నిత్యం కేంద్రంపై దుమ్మెత్తి పోయడం అలవాటైంది కాంగ్రెస్ ప్రభుత్వానికి . మోదీ ప్రభుత్వం ఎరువుల కొరత లేకుండా కావాల్సినన్ని ఎరువులను సరఫరా చేస్తున్నా... వాటిని అందుబాటులో ఉంచడంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ పెట్టడం లేదన్నారు ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి లాగుల తొండలు విడుస్తా అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. 6గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజలను దారి మళ్లిస్తున్నారు. కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ పెట్టడాన్ని హర్షిస్తున్నాం. ఇది ప్రజాస్వామ్య దేశం. ఎవరైనా పార్టీ పెట్టొచ్చు. ప్రజా సమస్యలపై పోరాడిన పార్టీలకే మనుగడ ఉంటుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డ బోయిని గోపి, చెన్నమనేని వికాస్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు, జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, గ్రామాల అధ్యక్షులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

# ఇద్దరు సైబర్ నేరస్తులను అరెస్టు చేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు



**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**
ఖమ్మం : ఆన్లైన్ లో ట్రేడింగ్,ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు 2 కోట్ల రూపాయలు మోసం చేసిన కేసులో ఇద్దరు నిందుతులను ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు ఆంధ్ర ప్రదేశ్ లోని వెస్ట్ గోదావరి జిల్లా, తణుకు పట్టణంలో అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన వ్యాపార వేత్త కి వాట్సాప్ లో పరిచయమైన వ్యక్తులు ఆన్లైన్ లో ఎఫ్ ఎక్స్ ప్రో కంపెనీలో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి వాట్సప్ ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 2 కోట్ల రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయిన కేసులో గాను 7 లక్షలు రూపాయిలు అక్కౌంట్ కి వెళ్ళిన అక్కౌంట్ హోల్డర్స్ అయిన ఎండి. సాదిక్ (35సం), శ్యామ్ బాబు (21సం) లను , తణుకు లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డిఎస్పీ, సి హచ్ .ఆర్.వి. ఫణిందర్,ఇన్స్పెక్టర్ కొండపర్తి నరేశ్ ,ఎస్సై రశీజిత్ కుమార్ ,కానిస్టేబుల్స్ వెంకట కృష్ణరావు ,కిషన్ రావు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు..

# వచ్చే నెల 7వ తేదీన కోడెల పంపిణీ

- గోశాలలో అందుబాటులో 300 కోడెలు
- ఉమ్మడి కరీంనగర్, పరిసర జిల్లాల చిన్న, సన్నకారు రైతులు
- దరఖాస్తు చేసుకోవాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే , మార్చి 28**
వచ్చే నెల (ఏప్రిల్)7వ తేదీన వేములవాడ పరిధి తిప్పాపూర్ లోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్‌లోని గోశాలలో కోడెలను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ గోశాలలోని మధ్యస్థం నుంచి పెద్దగా ఉన్న 300 కోడెలు మంగళవారం ఉదయం 07.00 గంటలకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, పరిసర జిల్లాల రైతులు అర్హులని స్పష్టం చేశారు. కోడెల కోసం 1.5 నుంచి 5 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న సన్నకారు, చిన్నకారు రైతులు అర్హులని, వారు వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్, తమ సమీప మండల వ్యవసాయ అధికారి/ఏఈఓ నుంచి ధ్రువపత్రం, ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈవెబ్సైట్ ( https://rajannasircilla.telangana.gov.in/ ) లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న రైతులు దానికి సంబంధించిన పత్రాలతో వచ్చే నెల (ఏప్రిల్ ) 7వ తేదీన మంగళవారం ఉదయం 07.00 గంటలకు వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ గోశాలకు కోడెల కోసం రావాలని తెలిపారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.జియో ట్యాగింగ్ ఉన్న కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని స్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు. పక్కదారి పట్టినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ హెచ్చరించారు.

# నూతన సీసీ రోడ్డుకు భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ కవితా రామ్మోహన్ రెడ్డి



**మర్కుక్ మార్చ్ 28 (మీడియా టుడే)**
మర్కుక్ మండలం మాజీ సీఎం దత్తత గ్రామం అయినా ఎర్రవల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాల లో భాగంగా ఈరోజు ఐదవ వార్డ్ లో నూతన సిసి రోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ నారన్న గారి కవిత రామ్మోహన్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేయడం జరిగింది. అనంతరం సర్పంచ్ కవిత రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు ఒకటి తర్వాత ఒకటి చేయడం జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎడమ సబితా కరుణాకర్ మరియు వార్డు సభ్యులు కుంట శ్రీను , పద్మ నాగేష్ యాదవ్, గొడుగు కరుణాకర్, కూర రాజు, యాదగిరి బలిపురం, తొందురు శేఖర్, కుమ్మరి గణేష్ మరియు గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ భాగ్య బిక్షపతి కృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు గోదా ఆంజనేయులు,చింతకాయల స్వామి ప్రజలు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- టీజీ ఎస్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ కోటేశ్వరరావు.
- పేరంటాల చెరువు వద్ద "స్వచ్ఛ తెలంగాణ - క్లీన్ అండ్ గ్రీన్".
- టీజీ ఎస్పీఎఫ్ బీటీపీఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, పరిశుభ్రత చర్యలు.




**మణుగూరు,మార్చి 28(మీడియా టుడే):**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని టీజీ ఎస్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ కోటేశ్వరరావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పేరంటాల చెరువు వద్ద టీజీ ఎస్పీఎఫ్ బీటిపిఎస్ యూనిట్ ఆధ్వర్యంలో "స్వచ్ఛ తెలంగాణ--క్లీన్ అండ్ గ్రీన్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కమాండెంట్ కోటేశ్వరరావు, అసిస్టెంట్ కమాండెంట్ తిరుపతి హాజరై మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం చెరువు పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారాన్ని తొలగించి పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ, టీజీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. చెరువుల్లో ప్లాస్టిక్ కలవడం వల్ల నీటిని తాగే జీవులు అనారోగ్యానికి గురవుతాయని, భూసారం కూడా దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామం, మండలం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రమేష్, చందు, సర్పంచ్ ఉషారాణి, ఉపసర్పంచ్ రమేష్, ఎస్పీఎఫ్ సిబ్బంది, గ్రామస్తులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## గన్నవరం ఎంపిపిఎస్ స్కూల్లో పనిచేస్తున్న హెచ్ఎం లతపై ఎం ఈ ఓ కుల వివక్ష

**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం :వైరా మండలం గన్నవరం ఎం పి పి ఎస్ గ్రామ హెచ్ యం లత పై మండల ఎం ఈ ఓ వెంకటేశ్వర్లు కుల వివక్ష చూపుతున్నాడు. వివక్ష అవమానించడం, వ్యంగం గా మాట్లాడటం, చేస్తున్నాడు. ఎం ఈ ఓ ఆగడాలకు అంతులేకుండా పోతున్నాయనివైరా ఎం ఈ ఓ వెంకటేశ్వర్లు పై చర్యలు తీసుకోవాలని గన్నవరం గ్రామ దళిత ప్రజలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉన్నత అధికారులకు వినత పత్రం అందిస్తామంటూ తెలియజేశారు. వైరా మండల పరిధిలో ఉన్న గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల్లో అందించ లేనటువంటి విద్యను గన్నవరం గ్రామ స్కూల్లో హెచ్ ఎం స్టాప్ అందిస్తున్న విద్యను ఎం ఈ ఓ వెంకటేశ్వర్లు జీర్ణించుకోకపోవడం దుర్మార్గుడు చర్య అన్నారు. ఎం ఈ ఓ స్థాయిని మరిచి గన్నవరం హెచ్ ఎం లత ని అడుగడుగునా కించపరచటం, అవమానించడం జరుగుతుందన్నారు. గతంలో కూడా పిల్లలకు కావాల్సిన బుక్స్, యూనిఫామ్ ను ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశాడన్నారు. దళిత మహిళా కాబట్టే ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డును రాకుండా అడ్డుకున్నాడు. గన్నవరం చిన్న స్కూల్లో హెచ్ ఎం ని పిల్లలు ,తల్లిదండ్రులు, గ్రామ సర్పంచ్ కారుమంచి యేసు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ఎమ్మార్పీఎస్ దళిత సంఘాలు, మద్దతుగా నిలిచాయి. గతంలో ఎం ఈ ఓ వెంకటేశ్వర్లు గన్నవరం హైస్కూల్లో పనిచేశాడు. పిల్లలకు మంచి విద్యను అందించాల్సిన అతను స్కూలు మూత వేయడానికి ప్రయత్నించాడు. అప్పుడు కూడా గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. ఈ విషయమై అధికారుల స్పందించి ఎం ఈ ఓ మీద తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కారుమంచి వెంకన్న ,నాగరాజు, చంటిబాబు ,తులసిరావు ,ప్రభాకర్ రావు, రాజు ,అఖిలు ,నిఖిల్, రాహుల్ ,సన్నీ ,బలవంతపు కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.




# ఏప్రిల్ 5న నవీన్ యాదవ్‌తో పాటు జిల్లా యాదవ,కురుమ ప్రజాప్రతినిధులకు కు ఘన సన్మానం

**మేకల మల్లి బాబు యాదవ్, చిలకల వెంకట నరసయ్య, చిత్తారు సింహాద్రి యాదవ్**





**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం : అఖిల భారత యాదవ మహాసభ – గొర్రెల పెంపకం దారుల సంఘం ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఏప్రిల్ నెల 5వ తారీఖు ఆదివారం రోజు 10:30 కు ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచిన యాదవ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తోపాటు ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిచిన ఖమ్మం జిల్లా యాదవ కురుమ ప్రజాప్రతినిధులు యాదవ కురుమ సర్పంచులు ఉపసర్పంచ్ లు, మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ లకు బైపాస్ రోడ్డు, రామకృష్ణ ఫంక్షన్ హాల్, ఖమ్మంలో సన్మాన సత్కార కార్యక్రమం నిర్వహించబడుతుందని అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, రాష్ట్ర కార్యదర్శి లోడిగ వెంకన్న యాదవ్, యాదవ యువజన జిల్లా అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్, దుబాకుల వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం నాడు జరిగిన పాత్రికేయుల సమావేశంలో మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ జిల్లాలోని యాదవులను రాజకీయంగా, సామాజికంగా చైతన్య పరచాలనే ఉద్దేశంతో ఇటీవల జూబ్లీహిల్స్ లో జరిగిన ఉప ఎన్నికలో అత్యధిక మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తోపాటు ఖమ్మం జిల్లాలో గెలిచిన యాదవ కురుమ ప్రజాప్రతినిధులను సన్మానించుకుంటున్నామని, తెలంగాణ రాష్ట్రంలో జనాభాపరంగా యాదవులు కురుమలు 18 శాతం ఉన్నప్పటికీ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దాదాపు మూడు లక్షలు జనాభా ఉన్నప్పటికీ అసెంబ్లీలో గాని, నామినేటెడ్ పోస్టులలో గాని,జిల్లాస్థాయిలో గాని రాజకీయంగా ప్రాతినిధ్యం లేకపోవడం దురదృష్టకరమని, ఇది కేవలం యాదవ జాతిలో ఐక్యత, సామాజిక చైతన్యం లేకపోవడమేనని, కొన్ని అభివృద్ధి చెందిన కులాలు వివిధ రాజకీయ పార్టీలో ఉన్నప్పటికీ వారంతా ఐక్యంగా ఉండి రాజకీయ పదవులు అనుభవిస్తున్నారని, అలాంటి వారిని చూసి బీసీలు ఎంతో నేర్చుకోవాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా యాదవ యువకులు యాదవ హక్కుల కొరకు,ఐక్యత పై రాజకీయాలకతీతంగా, వర్గాలకతీతంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నదని పిలుపునిచ్చారు. యాదవులు కురుమలు బీసీలు ఎన్నో సంవత్సరాల నుండి పోరాటాలు చేస్తున్నా కూడా రాజకీయంగా ఎదగలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కురుమ సంఘాల నాయకులు, మేధావులు పాల్గొంటున్నారని కావున ఈ సన్మాన కార్యక్రమాన్ని యాదవ కురుమలు రాజకీయాలు వర్గాలకతీతంగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా మల్లి బాబు యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేతుల నాగేశ్వరరావు, గూదే భద్రయ్య, మల్లె బోయిన శ్రీనివాస్, కనక బండి విజయలక్ష్మి చంద్రకాని గట్టయ్య చంద్రకాని రమణ, తెల్లబోయిన రమణ బట్టు కోటేశ్వరరావు, మేకల సైదులు దొంత బోయిన ఉపేందర్, బండారు ప్రభాకర్ బమ్మిడిశ్రీనివాస్,మొరి మేకల కోటయ్య మొరిమేకల నాగేశ్వరరావు, తోట అప్పారావు మేడిదల మల్లేష్, రాగం బాబురావు మల్లాది మల్లయ్య, మంద నాగేశ్వరరావు సత్తి వెంకన్న చింతల నరసింహారావు, ఇమ్మడి రామనాథం కాల్వ నరసింహారావు మేకల అశోక్, శ్రీశైలం యాదవ్, ఎర్రబోయిన నరసయ్య, వరదబోయిన నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం

## కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ సువర్ణావకాశం

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు, మార్చి28(మీడియా టుడే):**
కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 బెంచీలు ఏర్పాటు చేసి వివిధ రకాల కేసులను పరిష్కరించే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని, పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఇరుపక్షాలు స్నేహపూర్వక వాతావరణంలో సమస్యలను ముగించుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మైంటెనెన్స్ కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు వంటి అంశాలను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసు పరిష్కారం జరిగితే కోర్టు ఫీజు తిరిగి చెల్లించబడుతుందని, దీని వల్ల సమయం,డబ్బు రెండూ ఆదా అవుతాయని వివరించారు. లోక్ అదాలత్ తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమని, దీనిపై మళ్లీ అప్పీల్‌కు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఈ విధంగా కేసులు పరిష్కారం కావడం ద్వారా ఇరుపక్షాల మధ్య శత్రుత్వం తగ్గి సఖ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కక్షిదారులకు ఎస్బిఐ బ్యాంక్ సౌజన్యంతో పులిహోర,మంచినీళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సరితా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, మెజిస్ట్రేట్లు సుచరిత, బత్తుల రవికుమార్, వినయ్ కుమార్, సాయి శ్రీ, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి భద్రగిరి మార్ట్

- ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ - హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.
- ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరి మార్ట్ ప్రారంభం









**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు, మార్చి28(మీడియా టుడే):**
ప్రజల ప్రయోజనార్థం ఎంతో దూర దృష్టితో భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఐఏఎస్ కృషి తో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శనివారం ఈ మార్టును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్ట్ లోని అటవీ ఉత్పత్తులను గవర్నర్ పరిశీలించారు. ప్రజా ఉపయోగకర అనేక అటవీ వస్తువులను ఈ మార్ట్ లో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని, ఇవి ప్రజలకు ఎంతగానో ఉపకరిస్తాయని ఇందుకు కృషి చేసిన ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ని గవర్నర్ ఈ సందర్భంగా అభినందించారు.

**భద్రగిరి మార్ట్ పిఓ రాహుల్ కు మరో మైల్ రాయిగా నిలుస్తుంది - మంత్రి తుమ్మల.**

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, గిరిజన ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ను కల్పించడంతోపాటు స్థానిక గిరిజన కుటుంబాలకు ఆర్థిక బలాన్ని అందించే సదాశయంతో ఏర్పాటు చేసిన ఈ మార్టును స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని, ఇప్పటికే ట్రైబల్ మ్యూజియం వంటి వినూత్న కార్యక్రమాలతో గుర్తింపు పొందిన పిఓ రాహుల్ భద్రగిరి మార్ట్ అందుబాటులోకి తేవడంతో మరో మైల్ రాయిగా నిలుస్తుందని, గిరిజనుల సాంప్రదాయ ఉత్పత్తులు, వారి ప్రతిభకు సరైన గుర్తింపు ఇవ్వడం, అలాగే వారి జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ మార్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని, భద్రాచలం ప్రజలు గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేసి, గిరిజన ఎస్ హెచ్ జి గ్రూప్ మహిళలు, గిరిజన రైతులకు ఆర్థికంగా చేయూత అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్,భద్రాచలం ఐటీడీఏ పీవో బి రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్,ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం



**భద్రాచలం,మార్చి28(మీడియా టుడే):**
దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. మిథిలా ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకలకు దేశ నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్ల స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు.అర్చకుల వేదమంత్రాల మధ్య సంప్రదాయబద్ధంగా పట్టాభిషేకం నిర్వహించారు. భద్రుని మండపంలో పాదుకలకు అభిషేకం చేసి, గౌతమీ నది తీర్థాలతో మిథిలా ప్రాంగణానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. భాజా భజంత్రీలు, సన్నాయి మేళాలు, భక్తుల కోలాటాలతో ప్రాంగణం మార్మోగింది.కళ్యాణ మండపంలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం నిర్వహించి, పాదుకలు, రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీటం, రత్నాభరణాలతో స్వామివారికి పట్టాభిషేకం చేశారు. వేద పారాయణాలు, మహాకుంభ తీర్థప్రోక్షణ అనంతరం హారతులు సమర్పించారు.

**శ్రీరామ నామ స్మరణలతో మార్మోగిన మిథిలా ప్రాంగణం**

పట్టాభిషేక వేడుకలు సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. తొలుత రామాలయంలో భద్రుని మండపంలో స్వామివారి పాదుకలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం గౌతమీ నదీ తీరంనుంచి పవిత్ర తీర్థములను తీసుకువచ్చి రాజ లాంఛనాలతో మిథిలా ప్రాంగణానికి ఊరేగింపుగా స్వామివారిని తీసుకు వచ్చారు. భాజా భజంత్రీల నాదాలు, సన్నాయి మేళాలు, భక్తుల కోలాటాలతో ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.కళ్యాణ మండపంలో స్వామివారు ఆశీనులైన అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం నిర్వహించారు. తరువాత పాదుకలు, రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీటం, ఖడ్గం, రత్నాభరణాలతో స్వామివారికి రాజలాంఛనాలు అలంకరించి పట్టాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేద పారాయణాలతో పాటు విష్ణు పురాణం, భగవత్ శాస్త్ర పారాయణాలు జరిగాయి. పుష్కర జలాలతో మహాకుంభ తీర్థప్రోక్షణ నిర్వహించగా, అనంతరం హారతులు సమర్పించారు.పట్టాభిషేక వేడుకల సందర్భంగా మిథిలా ప్రాంగణం మొత్తం శ్రీరామ నామ స్మరణలతో మార్మోగింది. కార్యక్రమం అనంతరం భక్తులపై పుణ్య నదీ జలాలను చల్లి ఆశీర్వదించారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రజల సుభిక్షం కోసం ప్రార్థించారు. ఆలయ అభివృద్ధికి రూ.350 కోట్లతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు.ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరి మార్ట్‌ను గవర్నర్ ప్రారంభించారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం లక్ష్యంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గవర్నర్ పర్యటనకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు.

# సాగునీరు అందక రైతుల పంటలు ఎండిపోవడం దారుణం

**దేవాదుల అధికారుల నిర్లక్ష్యంతో ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం**

**తక్షణమే కాలువలు మరమ్మతు చేసి సాగునీరు అందించాలి - ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్**





**వరంగల్ జిల్లా బ్యూరో మర్చి 28,మీడియా టుడే.**
వర్ధన్నపేట--సంగెం పరిధిలో దేవాదుల ఎత్తిపోతల పథకం కింద సాగునీరు అందాల్సిన రైతులకు కాలువల ద్వారా నీరు చేరకపోవడంతో పంటలు ఎండిపోతూ తీవ్ర నష్టం వాటిల్లుతోందని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు ప్రధాన కారణమని ఆరోపిస్తూ, వెంటనే చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఏఐకేఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించే డి-8 నంబర్ కాలువతో పాటు ఆయకట్టు రైతుల పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా చెన్నారం, రామచంద్రా పురం, గవిచర్ల, ఆశాలపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ, ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకం కింద 1,23,000 ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించినప్పటికీ, కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేసినా క్షేత్రస్థాయిలో రైతులకు ప్రయోజనం చేకూరడం లేదని విమర్శించారు. దేవాదుల 8వ నంబర్ కెనాల్ పరిధిలోని 39 తూముల ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, మెజారిటీ రైతులకు నీరు అందడం లేదని పేర్కొన్నారు.కాలువల మెయింటెనెన్స్ సరిగా లేక చెట్లు, పొదలు, పూడిక పేరుకుపోవడంతో నీరు దిగువ ప్రాంతాలకు చేరడం లేదని, కొన్ని చోట్ల లైనింగ్ పనులు కూడా పూర్తికాకపోవడం వల్ల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. ఎన్నో ఆశలతో వరి, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలు సాగు చేసిన రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి, ఆరుగాలం కష్టపడి సాగుచేసినా చివరికి సాగునీరు అందక పంటలు ఎండిపోవడం బాధాకరమన్నారు.రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా దేవాదుల నీటిపారుదల శాఖ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళనకరమని, రైతుల ప్రయోజనాల కంటే అధికారుల అలసత్వమే ఎక్కువగా కనిపిస్తోందని విమర్శించారు. రైతుల పంటలు ఎండిపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్పష్టం చేశారు.ఇప్పటికైనా తక్షణమే స్పందించి దేవాదుల ఎత్తిపోతల సాగునీటి కాలువలను మరమ్మతు చేసి, ఆయకట్టు రైతులకు క్షేత్రస్థాయిలో సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబా బాబురావు, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్, ఎంసిపిఐ(యు) వరంగల్ డివిజన్ కార్యదర్శి మంద రవి, రైతు సంఘం జిల్లా నాయకులు సోమిడి రవి, శివ కుమారస్వామి, మహమ్మద్ రఫీ, అమ్మరాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కీర్తినగర్‌లో స్పెషలిస్ట్ వైద్య శిబిరం విజయవంతం

**142 మందికి వైద్య సేవలు... 29 మందికి రక్త పరీక్షలు**

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య శిబిరం నిర్వహణ**




**వరంగల్, జిల్లా బ్యూరో మార్చి 28, మీడియా టుడే.**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కీర్తినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన స్పెషలిస్ట్ వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది.ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని స్థానిక వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ మహ్మద్ హుస్సేనీ ప్రారంభించారు. శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు, సలహాలు, చికిత్సలు అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ సయ్యద్ మహ్మద్ హుస్సేనీ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో పిల్లల వైద్యం, స్త్రీల ఆరోగ్యం, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, నేత్ర వైద్యం, దంత వైద్యం వంటి విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్లు సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్య సమస్యలను పరీక్షలు, చికిత్సల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.ముఖ్యంగా స్త్రీలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు, ఎముకలు-మోకాళ్ల నొప్పులు, సాధారణ అనారోగ్య సమస్యలు, కంటి సమస్యలు, దంత సమస్యలు వంటి అంశాలపై నిపుణులైన వైద్యులచే వైద్య సేవలు అందించామని చెప్పారు. ప్రభుత్వ షెడ్యూల్ మేరకు ఇలాంటి వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ వైద్య శిబిరంలో మొత్తం 142 మంది పాల్గొని వైద్య సేవలు పొందగా, అందులో 29 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించినట్లు వైద్య అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఈదురు అనిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న స్పెషలిస్ట్ వైద్య శిబిరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించారని తెలిపారు. శిబిరానికి వచ్చిన వారికి సరైన పరీక్షలు, చికిత్సలు, ఆరోగ్య సలహాలు అందించడం జరిగిందన్నారు.అదేవిధంగా మాతా-శిశు సంరక్షణ, సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు, ఎండాకాలంలో వ్యాపించే వ్యాధులు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించామని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఆరోగ్య సమస్యలను వైద్య సిబ్బందికి వివరించి తగిన పరీక్షలు, చికిత్సలు చేయించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులుగా స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీవిద్య, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రియాంక మేధా, నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ తేజశ్రీ, జనరల్ మెడిసిన్ వైద్యురాలు డాక్టర్ అర్చన, దంత వైద్య నిపుణురాలు డాక్టర్ సునీత, ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ వంశీ కిషోర్ పాల్గొన్నారు.అలాగే సీఓ వైకుంఠం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆశా వర్కర్లకు రూ.18,000 కనీస వేతనం వెంటనే అమలు చేయాలి

- పోలీసుల దాడులు అంగీకారయోగ్యం కాదు
- ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం
- బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న






**ములుగు జిల్లా బ్యూరో మార్చి 28, మీడియా టుడే.**
హైదరాబాద్ లో ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద ఆశా వర్కర్లపై జరిగిన పోలీసుల తోపులాట, అరెస్టుల ఘటనపై బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై పోలీసులు దౌర్జన్యానికి దిగడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు రూ.18,000 కనీస వేతనం అమలు చేస్తామని స్పష్టంగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని అమలు చేయకుండా కాలయాపన చేయడం ఆశా వర్కర్లను మోసం చేసినట్టేనని విమర్శించారు.అసెంబ్లీ ముట్టడి సందర్భంగా తమ డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లపై పోలీసులు ఓవరాక్షన్ చేసి, అరెస్టుల పేరుతో మహిళలను తోసిపుచ్చడం, లాగడం, దాడి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని జంపన్న మండిపడ్డారు. ఈ ఘటనలో పలువురు ఆశా వర్కర్లు గాయపడటం బాధాకరమని, మహిళా కార్మికుల పట్ల ఇలాంటి వ్యవహారం ఏ మాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలందించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి సరైన గౌరవం, తగిన వేతనం, భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం నిత్యం కష్టపడుతున్న ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ముఖ్యంగా రూ.18,000 కనీస వేతనం వెంటనే అమలు చేసి, వారిపై నమోదైన కేసులు ఉంటే ఉపసంహరించుకోవాలని, గాయపడిన వారికి సరైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.ఇకపై కూడా ఆశా వర్కర్ల డిమాండ్లను పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, ప్రభుత్వం పై ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్ర ఒత్తిడి తీసుకువస్తామని భూక్య జంపన్న హెచ్చరించారు.

# కిట్స్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో నైపుణ్యాబివృద్ధి పై శిక్షణ



**కోదాడ, మార్చి 28 (మీడియా టుడే)-:**
కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జి ( టాస్క్ ) ఆధ్వర్యంలో బీటెక్ ఎలక్ట్రానిక్, మరియు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ , మూడవ సంవత్సరం చదువు తున్న విద్యార్థినులకు, టాస్క్ నిపుణులు పి. మనోజ్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగినది.ఈ శిక్షణ తరగతులలో విద్యార్థి నులకు సాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రాం మీద విద్యార్థి నులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ళపల్లి గాంధీ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచం లో విద్యార్థినులు వివిధ నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడు మాత్రమే ఉన్నత ఉపాధి అవకాశాలు అందుకోవచ్చని అన్నారు.ఈ కార్యక్రమం లో కళాశాల డైరెక్టర్ డాక్టర్ నాగార్జున రావు, విబాగాదిపతులు శివాజి, నరేష్ రెడ్డిఅధ్యాపకులు, విద్యార్థి నులు పాల్గొన్నారు.

# కోదాడలో నడి రోడ్డుపై కారు బోల్తా



**కోదాడ, మార్చి 28 (మీడియా టుడే)-:**
కోదాడ పట్టణంలో సూర్యాపేట రోడ్డులోని జూడియో వద్ద శనివారం నడిరోడ్డుపై ఒక కారు బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.అయితే, పిల్లలు ఆడుకునే కారు తలకిందులైనట్లుగా కారు బోల్తా కొట్టిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. నడి రోడ్డుపై కారు బోల్తా కొట్టడంతో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# ఆశ వర్కర్లను అక్రమ అరెస్టులు చేయడం అన్యాయం

**ఆశ వర్కర్ల పట్ల ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలి**

**సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే, మార్చి 28**
ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని శనివారం రోజున ఆశా వర్కర్ల చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ మహాధర్న ను భగ్నం చేయాలని జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆశా వర్కర్లను అక్రమంగా ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడాన్ని సిఐటియు రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ తీవ్రంగా ఖండించారు ఈ సందర్భంగా సిరిసిల్లలోని సుందరయ్య నగర్ , అంబేద్కర్ నగర్ ( పి హెచ్ సి) ల ఆశా వర్కర్లను పోలీసులు అరెస్టు చేసి అక్రమంగా పోలీస్ స్టేషన్ లో నిర్బంధించిన వారిని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల జరుగుతున్న ఈ సందర్భంగా ప్రభుత్వం ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలో కి వస్తే ఆశా వర్కర్ల కు నెలకి 18 వేల రూపాయల ఫిక్స్ వేతనాన్ని ఇస్తామని,పని భద్రత కల్పిస్తామని అనేక హామీలు ఇవ్వడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 27 నెలలు అవుతున్న ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆశాలకు రావలసిన పారితోషకాలు కూడా సకాలంలో ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి నిరసన , ధర్నా తెలియజేసే హక్కు కల్పిస్తున్నామని చెబుతూనే మరోవైపు శాంతియుతంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాకు వెళుతున్న ఆశా వర్కర్లను పోలీసుల చేత నిర్బంధించడం అన్యాయం అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి ఆశ వర్కర్ల పైన చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీల కోసం బడ్జెట్ కేటాయించాలని లేకుంటే రానున్న రోజుల్లో పోరాటాలు , ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో లావణ్య , చంద్రకళ , రజిత , నిర్మల , మమత , లక్ష్మి , గీత , స్వప్న , జ్యోతి , బాలలక్ష్మి , అనిత తదితరులు ఉన్నారు.

# గృహప్రవేశాలకు ఇందిరమ్మ ఇండ్లను సిద్ధం చేయాలి

**-కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 28 :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ప్రారంభించిన ఇండ్లను పూర్తిచేసుకుని గృహప్రవేశాలకు సిద్ధమయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులు తుమ్మనవేణ రజిత, కుంటు రాధతో మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి ఇప్పటివరకు అయిన ఖర్చు, ప్రభుత్వం నుండి వచ్చిన బిల్లులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకొని పూర్తి లబ్ధి పొందాలని సూచించారు.ఈ సందర్భంగా హౌసింగ్, పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతూ. ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని అన్నారు. వారికి ఏమైనా సమస్యలు ఉన్నట్లు యితే పరిష్కరించాలని అన్నారు. ఇండ్ల నిర్మాణానికి ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని ఎంపీడీవోను ఆదేశించారు. మోడల్ గ్రామాలు, మొదటి మొదటి దఫాలో ఎంపికైన లబ్ధిదారుల ఇండ్లు నూరు శాతం పూర్తయ్యేలా చూడాలని అన్నారు.కలెక్టర్ వెంట గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు సంచాలకులు శ్రీనివాస్, డి.ఈ వెంకటరమణ, ఏ.ఈ శ్రీజ,ఎంపీడీవో మల్హోత్రా,తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

# కుటుంబ కలహాలతో కుమారుడితో కలిసి గోదావరిలో దూకిన మహిళ

**కాపాడిన స్థానిక యువకులు,డిడిఆర్ఎఫ్ బృందం**

**భద్రాచలం,మార్చి28(మీడియా టుడే):**
పాల్వంచ మంచికంటి నగర్ కు చెందిన స్వరూప అనే మహిళ కుటుంబ కలహాలతో శనివారం మధ్యాహ్నం సమయంలో తన రెండేళ్ల కుమారుడితో ఆత్మహత్య చేసుకోవడానికి భద్రాచలం బ్రిడ్జి పై నుండి గోదావరి నదిలో దూకింది. అదే సమయంలో అక్కడ ఉన్న బోటు నడిపే వ్యక్తి ప్రసాద్,చేపలు పట్టడానికి వెళ్ళిన ఇద్దరు యువకులు,డిడిఆర్ఎఫ్ బృందం మహిళ గోదావరి నదిలో దూకడాన్ని గమనించి వెంటనే స్పందించి అట్టి మహిళను,ఆమె రెండేళ్ల కుమారుడిని కాపాడారు.వెంటనే అంబులెన్స్ లో ఇరువురిని భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు వారిరువురికి చికిత్సను అందించి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడటం జరిగింది.తక్షణమే స్పందించి తల్లీ,కొడుకు ప్రాణాలను కాపాడిన బోటు ప్రసాద్,డిడిఆర్ఎఫ్ బృందం సభ్యులు,ఇద్దరు స్థానిక యువకులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.



# సిఐస్సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలి

**మార్చి 30న చలో హైదరాబాద్**



**( మీడియా టుడే గరిడేపల్లి మార్చి 28 )**
భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం )గరిడేపల్లి మండల అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు కార్మికులను ఉద్దేశించి వారుమాట్లాడుతూ బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్ ఫెడరేషన్(లేబర్ కమిషనర్ హైదరాబాద్) పిలుపుమేరకు. చమటోడ్చి కష్టించేకార్మికుల హక్కుల పరిరక్షణ. వారి సమస్యల పరిష్కారం కొరకు మార్చి 30వ తారీకు జరిగే ధర్నాని విజయవంతం చేయవలసిందిగా కోరారుశ్రమనినమ్ముకుని. శ్రామికుని ఆరోగ్యం గాలిలో కలిసిపోతున్న కష్టించి భవంతులు మీద బవంతులు కట్టి కష్టించే శ్రామికుని సమస్యలు పరిష్కరించలేకపోతున్నారు. నానాటికి శ్రమ దోపిడీ పెరిగిపోతుంది. కార్మికుడిజీవితమంతా భవంతుల నిర్మాణంలోనే మగ్గిపోయిందికార్మికుడు ఉండటానికి సరైన గూడు లేక. వారి పిల్లలకు సరైన చదువు లేక. వారి జీవితాలు చిందర వందరమయ్యే వారు రోడ్డున పడవలసిన పరిస్థితి దాపురించిదిరాజ్యంలో రాజులు లెందరుమారిన వారి జీవితాల్లో వెలుగు లేకపోయినా. ఒకపక్క బ్రతుకు కోసం పోరాటం. మరోపక్క హక్కులకోసం పోరాటం. ఇకనైనా కార్మికుల జీవితాలలో వెలుగు నింపాలని వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో శ్రామికులు .హుస్సేను. ప్రమీల. శాంతి. వీరమ్మ. చిన్ని. ఊర్మిళ. సాలమ్మ. ఉష. శాంతి. నీల మొదలగున్నవారు పాల్గొన్నారు

# శ్రీరామనవమి వేడుకల్లో ఐటీసీ పీఎస్‌పీడీ సేవలు

**- కళ్యాణం,పట్టాభిషేకం సందర్భంగా పులిహోర,బట్టర్ మిల్క్,వాటర్ ప్యాకెట్లు పంపిణీ**




**భద్రాచలం,మార్చి28(మీడియా టుడే):**
శ్రీరామనవమి,శ్రీరామపట్టాభిషేకం మహోత్సవాల సందర్భంగా ఐటిసి లిమిటెడ్ పీఎస్పీడీ యూనిట్ ఆధ్వర్యంలో, భద్రాచలం మహిళా సమితి సహకారంతో భక్తులకు విస్తృత స్థాయిలో అన్నదాన సేవలు నిర్వహించారు .శ్రీ సీతారాముల కల్యాణం నుండి పట్టాభిషేకం వరకు కొనసాగిన ఈ సేవల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, తీర్థయాత్రికుల కోసం ప్రత్యేక అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేశారు. పులిహోర సుమారు 800 కిలోలు, బట్టర్ మిల్క్ 1,50,000 గ్లాసులు, నీటి ప్యాకెట్లు 80,000 వరకు భక్తులకు పంపిణీ చేశారు.ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా సేవలు అందించడం విశేషం. ఆలయ ప్రాంగణం, బస్ స్టాండ్ ప్రాంతాల్లో ప్రత్యేక పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసి భారీగా తరలివచ్చిన భక్తులకు సేవలు అందించారు.అలాగే సారపాకలోని ఐటీసీ పీఎస్పీడీ కాంపౌండ్‌లో గెస్ట్ హౌస్‌లను అధికారులు, అతిథుల కోసం అందుబాటులో ఉంచారు. శుభ్రమైన గదులు, భోజన సౌకర్యాలు, 24 గంటల విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించారు.ఈ కార్యక్రమంలో హెచ్.ఆర్ జనరల్ మేనేజర్ శ్యామ్ కిరణ్, హెచ్.ఆర్ మేనేజర్ చెంగల్ రావు, గెస్ట్ హౌస్ ఇన్‌చార్జ్ శ్రీరామ్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది కీలకపాత్ర పోషించారు.గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంస్థ అందిస్తున్న సేవలను భక్తులు అభినందించారు.

# ఉచిత కంటి శిబిరం

**వృద్ధులు, మహిళలకు కళ్లజోళ్లు పంపిణీ**



**పాల్వంచ,మార్చి28(మీడియా టుడే):**
పాల్వంచ మండలం 9వ డివిజన్ పరిధిలోని రామచంద్రాపురం (గుడిపాడు)లో నిర్వహించిన శ్రీ బాలాజీ ఉచిత కంటి వైద్య శిబిరం గ్రామస్తులకు ఉపయోగపడింది. డాక్టర్ వి. కిషోర్, డాక్టర్ ఆర్. రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం ఈ శిబిరం నిర్వహించారు.శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ ఎన్. సురేష్ రెడ్డి (చీూ=) శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు.శిబిరంలో పరీక్షలు చేయించుకున్న 40 మంది వృద్ధులు, మహిళలకు ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామని ప్రకటించారు.అనంతరం శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి దేవస్థానం సన్నిధిలో ఎన్. సురేష్ రెడ్డి తల్లిదండ్రులు ఎన్. రామి రెడ్డి, శ్రీలత ఆధ్వర్యంలో నిరుపేదలకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు.కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న తమకు వెలుగు చూపినందుకు గ్రామస్తులు ఎన్. సురేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఆర్ టీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కీర్తి శేషులు పొదిల విజయలక్ష్మి చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రి తుమ్మలనాగేశ్వరరావు



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**
ఇటీవల కాలం ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు పొదిల రవికుమార్ మాతృమూర్తి ముదిగొండ మండలం ఖానాపురం మాజీ సర్పంచ్ పొదిల విజయలక్ష్మి అనారోగ్య కారణాలతో చనిపోయారు. ఆనాడు అందుబాటులో లేని కారణంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాలేకపోయారు. ఖమ్మం చర్చి కాంపౌండ్ నందు ఉన్న పొదిల రవికుమార్ ఇంటికి వెళ్ళి వారి మాతృమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..అనంతరం వారి తండ్రి పొదిల దేవేంద్రనాథ్ మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.వారివెంట రాష్ట్ర గిడ్డంగులు చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ వడ్డేబోయిన నరసింహారావు,జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు, మిక్కిలినేని నరేందర్,స్థానిక కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ వెంకట్,చౌడెం నరసింహారావు , వెన్న పండు, జి వి వి ఎల్ నరసింహారావు, వాకాటి రమేష్, తిరుమలశెట్టి జయప్రకాశ్ మరియు గోకుల్ తదితరులు ఉన్నారు.

# అంబులెన్స్‌లో ప్రసవం

**- తల్లి, శిశువు సురక్షితం.**



**అశ్వారావుపేట నియోజకవర్గం ప్రతినిధి మధు**
**మార్చి28(మీడియా టుడే)**
అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తతతో స్పందించి గర్భిణికి అంబులెన్స్‌లోనే సురక్షిత ప్రసవం నిర్వహించి తల్లి, శిశువు ప్రాణాలను కాపాడిన సంఘటన దమ్మపేట మండలంలో చోటుచేసుకుంది.లచ్చాపురం గ్రామానికి చెందిన తోట సత్యవేణి (20) రెండవ కాన్పు కోసం తీవ్రమైన ప్రసవ వేదనలతో బాధపడుతుండగా 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది గర్భిణిని పరీక్షించి పరిస్థితి అత్యవసరమని గుర్తించారు.ఆమెను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా నల్లకుంట గ్రామ సమీపంలో అంబులెన్స్‌లోనే ప్రసవం నిర్వహించారు. సిబ్బంది సమయోచితంగా చర్యలు తీసుకోవడంతో సత్యవేణి పండంటి ఆడ శిశువుకు సురక్షితంగా జన్మనిచ్చింది.తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉండగా అనంతరం వారిని దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .అంబులెన్స్‌లోనే ఆసుపత్రి సేవలు అందించి ప్రాణాలను కాపాడిన 108 సిబ్బందిని స్థానికులు ప్రశంసించారు.జుమీ రాజేష్ కల్లూరి, పైలట్ వెంకట్‌ల చాకచక్యానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# రైల్వే సైడింగ్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

**ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన**



**మణుగూరు,మార్చి 28(మీడియా టుడే):**
మణుగూరు ఏరియా రైల్వే సైడింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.డి. నాసర్ పాషా మాట్లాడుతూ, ప్రతినెల 7వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. ఫిబ్రవరి నెల వేతనాలు ఇప్పటికీ కార్మికుల ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు.వేతనాల ఆలస్యంతో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయని, కాంట్రాక్టర్లపై చర్యలు లేకపోవడంతో సమస్య కొనసాగు తోందన్నారు. ఏరియా యాజమాన్యం స్పందించి కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కుంటా రవి, జి. నాగేశ్వరరావు, కె. వీర్రాజు, ఎం. సాంబశివరావు, కె. నాగేశ్వరరావు, ఎం. భావ్ సింగ్, రామకృష్ణ, రజబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కొరతపై ప్రభుత్వ వైఫల్యం బహిర్గతం

**-ఆదివాసీ రాష్ట్ర సభ్యుడు వజ్జా జ్యోతి బసు**

**- నో స్టాక్ బోర్డుతో ప్రజల ఆవేదన**

**మణుగూరు,మార్చి 28(మీడియా టుడే):**



వంటగ్యాస్ (ఎల్పీజీ) కొరత తీవ్రంగా ఉందని, గ్యాస్ ఏజెన్సీల వద్ద "నో స్టాక్" బోర్డు కనిపించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆదివాసీ సేన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు వజ్జా జ్యోతి బసు ఆరోపించారు.ప్రభుత్వం గ్యాస్ సరఫరా సక్రమంగా జరుగుతోందని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజలు రోజులు, వారాలు తిరిగినా సిలిండర్లు దొరకడం లేదన్నారు. ముఖ్యంగా గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారిందని తెలిపారు.అధికారుల నిర్లక్ష్యం, సరైన సమాచారం లోపం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని, లేని పక్షంలో ఆదివాసీ సేన ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# హెల్మెట్ ధరించు క్షేమంగా గమ్యస్థానం చేరండి

**ఏఎస్ఐ చంద్రశేఖర్ - హెల్మెట్ లేని ప్రయాణం చట్టరీత్య నేరం**




**మీడియా టుడే మధిర:**
ట్రాఫిక్ నియమాలను పాటిద్దాం రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం ఇది వాహనదారుల అందరి బాధ్యతని ఏఎస్ఐ కె చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక మండల కేంద్రమైన ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్ నందు 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం స్టేషన్ నందు వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన వాహనదారులతో మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం దాని ప్రాధాన్యత గురించి తెలిపారు. హెల్మెట్ లేని ప్రయాణం సురక్షితం కాదని, ట్రిపుల్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని, డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదకరమని ఎస్సై వాహనదారులకు రోడ్డు నియమాలను వివరిస్తూ హెల్మెట్ ధరించండి సురక్షితంగా గమ్యస్థానం చేరండి అని ఆయన సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నాగేశ్వరరావు, ఎస్ నరేష్, శివ, వాహనదారులు,తదితరులు పాల్గొన్నారు

# ధ్వజస్తంభదాతకు ఘనంగా సన్మానం

**వలిగొండ మార్చి 28 మీడియా టుడే**



మండల పరిధిలో ని వేములకొండ గ్రామంలో గల శ్రీ అయోధ్య ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా అర్చకులచే భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి రామాలయం గుడిలో ధ్వజస్తంభ ఏర్పాటు చేసిన దాత సోలిపురం శ్రీకాంత్ రెడ్డి కి ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలశాలవతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం ఉప సర్పంచ్ అంబటి సాయికుమార్ ఆకుల వెంకటేశం రామాలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు గ్రామస్తులు తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు

# నేడే సప్త కళల సమ్మేళనం

**ముఖ్య అతిథులుగా వేల్పుల విజేత, కురువెల్ల ప్రవీణ్ కుమార్**





**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**
ఖమ్మం : ఫైర్ పార్థవిక అండ్ పండు ఎంటర్టైన్మెంట్ వారు సమర్పించు సప్త కళల సమ్మేళనం మార్చి 29 ఆదివారం సాయంత్రం 6.30 నిమిషాలకు భక్త రామదాసు కళాక్షేత్రం ఖమ్మం లో జరుగుతుందన్నారు. అందరు ఆహ్వానితులే సప్త కళల సమ్మేళనం అతిథులుగా ముఖ్య అతిథిగా కురువెల్ల ప్రవీణ్ కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మిత్ర గ్రూప్ చైర్మన్ సభ అధ్యక్షులు, వేల్పుల విజేత ఖమ్మం కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి, విశిష్ట అతిథులు కళాసారథి ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులుడాక్టర్ నాగ బత్తిని రవి, వివి అప్పారావు,ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, బొమ్మ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ గుర్రం కాంతారావు , ట్రస్మ ఖమ్మం జిల్లా అధ్యక్షులు చెల్లా శేషగిరిరావు అధ్యక్షులు ఖమ్మం జిల్లా ప్రవేట్ జూనియర్ కళాశాలలు యం డి జాఫర్ మతీన్ ట్రస్మా డివిజన్ అధ్యక్షులు కాళ్ల పాపారావు తెలంగాణ ఏజెన్సీ అతిథులుగా సప్త కళలు సమ్మేళనం లో పాల్గొంటారు. ఈ సందర్భంగా నాగబత్తిని రవి వేల్పుల విజేత మాట్లాడుతూ ...ఈ కార్యక్రమంలో ప్రదర్శనలు,బొమ్మ డాన్స్ టీవీ సినీ ఆర్టిస్ట్ జంక్షన్ శీను, జూనియర్ చిరంజీవి డూప్, డాన్స్ డబల్ హిట్ డాన్స్ హలో మేన్ డాన్స్ స్ప్రింగ్ డాన్స్ వెరైటీ బొమ్మ డాన్స్ అరుణ్ కుమార్ చెన్నై వారి చే సైకిల్ రిమ్ములు డాన్స్ సింగిల్ లెగ్ ప్రభు చెన్నై వారి చే ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలంగాణ సంస్కృతిక సారధుల ఆటపాట ఫైర్ కుటుంబం ప్రదర్శనలు ఫైర్ మ్యాజిక్ జగ్లింగ్ రింగ్ భరతనాట్యం స్కేటింగ్ పై భరతనాట్యం ఉంటాయి. అని ఈ సందర్భంగా తెలియజేసారు. అదే విధంగా ప్రేక్షక దేవుళ్ళు కవులు,కళాకారులు ప్రేక్షకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫైర్ కుటుంబశీ ఈ సందర్భంగా కోరారు.

# నల్ల బ్యాడ్జిలతో బొగ్గు గనులపై కార్మికుల నిరసన

**మెడికల్ బోర్డు సమస్యల పరిష్కారానికి డిమాండ్**

**దశలవారీ ఆందోళనలకు టిబిజికెఎస్ పిలుపు**



**మణుగూరు,మార్చి 28(మీడియా టుడే):**
మెడికల్ బోర్డు తదితర సమస్యల పరిష్కారం కోసం టిబిజికెఎస్ ఆధ్వర్యంలో బొగ్గు గనులపై కార్మికులు నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. శనివారం ఏరియాలోని అన్ని గనులు, విభాగాల వద్ద నిరసనలు తెలుపుతూ సంబంధిత హెచ్ఓడీలకు వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా టిబిజికెఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి మాట్లాడుతూ మెడికల్ బోర్డు రద్దుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను కార్మికులు ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ మార్గదర్శకత్వం, రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ పిలుపుతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.మెడికల్ బోర్డు నిర్వహణ కొనసాగింపు, అర్హత ఉన్న కార్మికులకు న్యాయం, విజిలెన్స్ సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలు వంటి అంశాలపై డిమాండ్లు ఉంచారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమం కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ నెల 30న సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ముందు నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం ముందు సోమవారం జరిగే ధర్నాలో కార్మికులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్ కుమార్, మురళీకృష్ణ, జంగం రాజ్‌కుమార్, సాంబార్ రాజశేఖర్, దిశెట్టి రమేష్, పీకే నాగరాజు, కమటం పరమేష్, బొద్దుల ప్రవీణ్, గూగులోత్ రమేష్ నాయక్, వినయ్ కుమార్, చిరుత వెంకటేశ్వర్లు, పద్దం శ్రీనివాస్, వర్క్‌షాప్ రెడ్డి, మస్తాన్, పీక శంకర్, కటారి ప్రసాద్, సర్వే నరేష్, ఇమ్రాన్, జ్యోతి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పాత పద్ధతిలో మెడికల్ బోర్డును నిర్వహించాలి

**అంబేత్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందచేసిన కార్మికులు**

**ఏఐటియుసి ఆధ్వర్యంలో పివికే5 గనిలో నల్ల రిబ్బన్లతో వినూత్న నిరసన**



**కొత్తగూడెం : మార్చి 28 (మీడియా టుడే )**
కార్మిక వ్యతిరేక వ్యాఖ్యలను కప్పిపుచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంఘం ఐఎన్టీయుసి నాయకులు సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట దొంగ నిరసన దీక్షలు చేస్తుందని ఏఐటియుసి అనుబంధం సింగరేణి కాలనీ, వర్కర్స్ యూనియన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులపై చేస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియాలో పివికే 5 గని కార్మికులు వినూత్నంగా రాష్ట్ర ప్రభుత్వనకి నిరసన సెగ తగిలేల నల్ల రిబ్బన్లు మొఖానికి కట్టుకుని ప్లే కార్డ్స్ తో నిరసన తెలిపారు. అనంతరం అంబేత్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందచేశారు. సింగరేణి కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా సింగరేణి కార్మికుల కుటుంబల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల మెడికల్ అన్ ఫిట్ వల్ల సింగరేణిపై ఆర్థిక భారం పడిందని అసెంబ్లీలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కార్మిక వ్యతిరేక వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. సింగరేణి కార్మిక వ్యతిరేక వ్యాఖ్యలను కప్పిపుచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంఘం ఐఎన్టీయుసి నాయకులు సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట దొంగ నిరసన దీక్షలు చేపట్టడం హాస్యాస్పదమని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కార్మికులకు పాత పద్ధతిలో మెడికల్ బోర్డును నిర్వహించాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ లో విధులు నిర్వహిస్తున్న జనరల్ అసిస్టెంట్స్ ను సర్ఫేస్ కన్వర్షన్ చేసి ఏరియాలో ఖాళీలు భర్తీ చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్ రావు, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్, ఎస్ నాగేశ్వరరావు, పివికే 5 పిట్ కార్యదర్శి భుక్య రమేష్, ఏరియా స్టోర్స్ పిట్ కార్యదర్శి కమల్, అసిస్టెంట్ ఫిట్ సందీప్ సేఫ్టీ కమిటీ సభ్యులు రామచందర్ మహేష్, సుమన్, కుమార్ రావు, జనరల్ షిఫ్ట్ ఇంచార్జ్ సంజీవ్, సుభాష్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ లక్ష్మణ్ జాయింట్ సెక్రెటరీ దేవ సింగ్, గణేష్, నరేష్, ఫక్రుద్దీన్, శివ, వినోద్, సురేష్, సంతానం, దాసరి శీను, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల స్కానింగ్ సెంటర్లు ఆకస్మిక తనిఖీ

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖదికారి డాక్టర్.రజిత**

**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే , మార్చి 28**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత రాజన్న జిల్లాలోని ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రుల స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించినారు. ఈ తనిఖీలు యందు రికార్డులను, స్కానింగ్ సెంటర్ల మిషిన్లను పరిశీలించినారు. ఫారం ట ఆడిట్లను పరిశీలించి గర్భిణీ స్త్రీ యొక్క వివరాలు సంతకాలు తీసుకొని, గర్భిణీ స్త్రీ స్కానింగ్ వివరాల ఫిలింను జత పరచాలని సూచిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా గర్భిణీ స్త్రీ కి ఆడ మగ (లింగ నిర్ధారణ) అని సైగల ద్వారా తెలియజేసిన వారి స్కానింగ్



సెంటర్ లను చీజ్ చేస్తామని, 10,000 రూపాయల జరిమానా విధిస్తూ, మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తామని స్కానింగ్ నిర్వాహకులకు సూచిస్తూ, రిజిస్ట్రేషన్ లేని ప్రైవేట్ ఆస్పత్రులను నిర్వహించినట్లయితే క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారము చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగాతెలియజేశారు. తనిఖీల కార్యక్రమంలో మహేష్ గౌడ్, నవీన , పాల్గొన్నారు.

# మేక పొడిస్తే గొర్రె పిల్ల పొట్ట బైటకు వచ్చిన పేగులు

## - ఆపరేషన్ తో పేగులను తిరిగి పొట్టలోకి చేర్చి, ప్రాణం పోసిన అసిస్టెంట్ డైరెక్టర్



**కోదాడ, మార్చి 28 (మీడియా టుడే)-:**
మునగాల మండలం , తాడ్వాయి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మందలోని మూడు మాసాల గొర్రెపిల్లని రెండు మాసాలక్రితం మేక పొడిచింది. మేకపొడిచిన దగ్గర కొద్దిగా వాపురావడం తో కొమ్ము దెబ్బకి అలా అయ్యింది అనుకున్నాడు యజమాని. ఆ వాపు రోజు రోజుకీ పెరుగు తుండడం తో తెలిసిన వారు లోపల చీము పట్టింది, పైన మందు రాయమంటే, ఏదో ఒక మందు రాస్తూ గడ్డ పగిలి చీము వస్తుందని రెండు మాసాలుగా ఎదురుచూస్తున్నాడు. రోజురోజుకీ వాపు పెరిగి పెద్దదయ్యిందే కానీ చీము రాకపోవడం తో మునగాల పశువైద్యశాలలో చూపించగా అక్కడి పశువైద్యుడి సలహా మేరకు గొర్రెపిల్లను కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకు వచ్చారు. గొర్రె పొట్ట కింద వాపును పరీక్షించిన అసిస్టెంట్ డైరెక్టర్ అది చీము గడ్డ కాదని, మేక పొడిచిన సమయం లో గొర్రెపిల్ల పొట్ట పగిలి , పగిలిన ప్రాంతం నుండి పొట్ట పేగులు క్రమంగా కిందకు జారి చివరకు మొత్తం బైటకు వచ్చి చర్మం కిందకు చేరడంతో చర్మం సాగి లోపల తిత్తి ఏర్పడి అలా గడ్డ లాగా పెరిగిపోయిందని ఆపరేషన్ ద్వారా మాత్రమే దానిని సరిచేయగలమని శస్త్ర చికిత్స నిర్వహించారు. తొలుత పొట్ట చర్మం తెరిచి చర్మం కింద ఉన్న పేగులను జాగ్రత్తగా శుభ్రపరచి పగిలిన బక్కి రంధ్రం ద్వారా కొద్ది కొద్దిగా పొట్టలోకి చేర్చి ఆపై బక్కని, కండరాల వరుసలని, చర్మాన్ని కుట్లతో మూసి వేసి విజయవంతంగా శస్త్రచికిత్స ముగిసింది అనుకున్నారు. కానీ రెండు నెలలుగా పేగులు జారడంతో వాట్ చుట్టూ ఒక తిత్తి ఏర్పడి సుమారు నాలుగు కిలోల మరిమానంలో కిందకి జారడం తో దానిని పూర్తిగా తొలగించాల్సి వచ్చింది. మరో రెండు గంటలు శ్రమించి మిరిగిన కండరాల తిత్తి చర్మాన్ని తొలగించి కండరాలను చర్మాన్ని కుట్లతో మూసి వేసి విజయవంతంగా శస్త్రచికిత్స ముగించి గొర్రెపిల్లకు తిరిగి ప్రాణం పోశారు. అంత పెద్ద శస్త్రచికిత్స అనంతరం మత్తు నుండి తేరుకున్న గొర్రె పిల్ల లేచి అటూ ఇటు తిరుగుతూ ఉండడం గమనించిన జంతుయజమానులు సంభ్రమాత్సర్యాలు వ్యక్తం చేశారు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ, జీవాల పెంపకం దారులు, మందలో గొర్రెలు మేకలు ఉన్నప్పుడు కానీ , ఎక్కువ సంఖ్యలో పోతులు ఉన్నప్పుడు పిల్లలను పొడుస్తూ ఉంటాయి. మందలో పిల్లలు లేదా పెద్ద జీవుల్లో పొట్ట కింద, పక్కన చిన్న ఉబ్బు లేదా గడ్డలాంటివి కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా దగ్గరలోని పశువైద్య శాలలో చూపించి వైద్యం చేయించు కోవాలని ఆలస్యం ఐతే జీవాల ప్రాణాలకే ప్రమాదం ఉంటుందని అన్నారు. శస్త్ర చికిత్సలో సిబ్బంది , సాయికృష్ణ, రాజు, చంద్రకళ, రాజేష్ పాల్గొన్నారు

# అగ్రహారం గ్రామ శివారులో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**
**మీడియా టుడే , మార్చి 28 :**
వేములవాడ పట్టణ పరిధిలోని అగ్రహారం గ్రామ శివారులో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అచ్చే లాల్ అనే వ్యక్తి అగ్రహారం గ్రామ శివారులో గంజాయి మొక్కలను పెంచుతున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి అక్కడ సాగు చేస్తున్న గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సకాలంలో స్పందించి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న ఎస్సై శ్రీనివాస్, కానిస్టేబుళ్లు మహిపాల్, సంతోష్ , హోంగార్డ్ ఆనంద్‌లను డీఎస్పీ శ్రీనివాసు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. గంజాయి సాగు చేయడం, రవాణా చేయడం, విక్రయించడం లేదా వినియోగించడం వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో ఎక్కడైనా ఇలాంటి అక్రమ వ్యాపారాలు లేదా సాగు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు ఫోన్ చేసి తెలపాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# "మై భారత్ ఖమ్మం "ఆధ్వర్యంలో యువ మండల్ వికాస్ అభియాన్ కార్యక్రమం

## ఖమ్మం రూరల్ మండలం లోని దరిపల్లి అనంత రాములు కళాశాలలో

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**




మై భారత్ ఖమ్మం ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల ఆదేశాల మేరకు అకౌంట్స్ అండ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కమర తపు భాను చందర్ సహకారంతో శ్రీ సాయి గణేష యూత్ క్లబ్ ప్రెసిడెంట్ కడారి ఉష యువ మండల్ వికస్ అభియాన్ కార్యక్రమం లో భాగం కొనిజర్ల మరియు నేలకొండపల్లి ఖమ్మం రూరల్, బోనకల్లు, చింతకాని మండలాలలో యువతకు యువ మండల్ వికాస్ అభియాన్ గురించి అవగాహన కల్పించి వారితో మైభారత్ లో రిజిస్ట్రేషన్ చేపించడం జరిగింది. ఆయా మండలాలు యువతకు అవగాహన కల్పించడం అయిపోయిన తరువాత ఖమ్మం రూరల్ మండలం నందుగల దరిపల్లి అనంతరాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (పాలిటెక్నిక్ డిప్లమా । ఎంబీఏ । బీటెక్) కళాశాలలో ప్రిన్సిపాల్ డా .దరిపల్లి కిరణ్ సహకారంతో ఈ అన్ని మండలాల నుంచి యువతను పిలిపించి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మైభారత్ తరపున స్పోర్ట్స్ కిట్లను అందించడం జరిగింది. కార్యక్రమం విజయవంతం చేయుటకు సహకరించినందుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ కి మరియు వైస్ ప్రిన్సిపల్ చైతన్య కి ఏవో చిరంజీవి కి మైభారత్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# బోర్వెల్ ను ప్రారంభించిన మూడో డివిజన్ కౌన్సిలర్ కొమరగిరి సత్యవతి సుమన్

## జీసస్ వాటర్ వెల్ కల్వరి మినిస్ట్రీస్ నాయుడుపేట.




**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి**
ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల నాయుడుపేట మూడో వార్డు నందు జీసస్ వాటర్ వెల్ కల్వరి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం నూతనంగా బోర్వెల్ నిర్మించడం జరిగింది చర్చి ఫాస్టర్స్ సంఘం నాయకులు వారి ఆహ్వానం మేరకు మూడో డివిజన్ కౌన్సిలర్ కొమరగిరి సత్యవతి సుమన్ హాజరై ప్రారంభించారు ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఏ కార్యక్రమం ఎవరు చేపట్టిన నా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని వారికి అన్ని సహకారాలు అందిస్తానని తెలిపారు ప్రస్తుత పరిస్థితిలో వేసవి కాలం లో ప్రజలకి నీళ్ల కొరత ఉంటుంది దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిన సంఘ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో నాయుడుపేట కాంగ్రెస్ నాయకులు గుండా మల్లయ్య షేక్ మదర్ సాహెబ్ అంకతి దామోదర్ సూదగాని జగదీష్ పొన్నేబోయిన లక్ష్మయ్య కార్యకర్తలు బంధువులు ఆత్మీయులు మిత్రులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# చెరువుమాదారంలో విజయవంతమైన మెగా హెల్త్ క్యాంప్

## 259 మంది రోగులకు వైద్య సేవలు





**నేలకొండపల్లి మార్చ్ 28 మీడియా టుడే**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం మండలంలోని చెరువుమాదారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గ్రామ సర్పంచ్ అమరగాని ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. తొలుత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచి అమరగాని ఎల్లయ్య ప్రారంభించారు. ఈ వైద్య శిబిరం నందు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సునీల్ (జనరల్ మెడిసిన్), డాక్టర్ సూర్యశారద (స్త్రీ ప్రత్యేక వైద్య నిపుణులు), డాక్టర్ పాషా (పిల్లల వైద్య నిపుణులు), డాక్టర్ పావని (నేత్ర వైద్య నిపుణులు), డాక్టర్ ఎస్ టి రాణి (దంత వైద్య నిపుణులు), డాక్టర్ రుష్మిత ఎముకల వైద్య నిపుణులు పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. వైద్యులు శిబిరములో పాల్గొన్న మొత్తం శిబిరంలో పాల్గొన్న 259 మందిని పరీక్షించి 8 మందిని మెరుగైన వైద్యనిమిత్తం ఖమ్మం ఏరియా హాస్పిటల్ కు పంపించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఆర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎర్రయ్య, తహసిల్దార్ వి వెంకటేశ్వర్లు, గ్రామ సెక్రెటరీ భాషా, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ ఎండి సన, డాక్టర్ ఎన్ నాగమణి, డాక్టర్ బి మాధవి, సిహెచ్ఓ పి శాంతిరాణి, హెచ్ఈఓ లు వీరన్న, చంద్రశేఖర్, నర్సింగ్ ఆఫీసర్ మార్తమ్మ, ఫార్మసిస్ట్ జోష్న, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, నర్సింగ్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం నిరుద్యోగులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

## ఏఐవైఎఫ్.పాలేరు నియోజకవర్గ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి



**నేలకొండపల్లి మార్చ్ 28 మీడియా టుడే**
రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) పాలేరు నియోజకవర్గ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రము లోని కర్నాటి కృష్ణయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, నిరుద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ఏటా 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని, నెలకు రూ. 4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి, ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం నిరుద్యోగ యువతను వంచించడమేనని మండిపడ్డారు. నిరుద్యోగ యువత ఎంతో కాలంగా వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న 'జాబ్ క్యాలెండర్'ను ఎందుకు విడుదల చేయడం లేదో ప్రభుత్వం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ తాత్సారం వల్ల వేలాది మంది యువకులు వయోపరిమితి దాటి పోతుందనిఆందోళనలో వ్యక్తం చేశారు. రాజీవ్ యువ వికాసం' పథకం కేవలం కాగితాలకే పరిమితమైందని ఆయన ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్‌లో ప్రకటించిన రూ. 5 లక్షల వడ్డీ లేని రుణాలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, ఉచిత శిక్షణ వంటి హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు మల్లెబోయిన ఉపేందర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పాలపాటి అశోక్ ఉన్నారు.

# ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

## నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్ తెలిపారు శనివారం రోజు తిరుమల లో స్వామి వారిని



దర్శించుకున్నారు ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ శంషాబాద్ మండలం ప్రజల సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నానని శ్రీకాంత్ గౌడ్ తెలిపారు తనతో పాటు వచ్చిన కుటుంబ సభ్యులు కలిసి స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్ అన్నారు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనేగౌని నరసింహ గౌడ్,శంకర్ గౌడ్,శ్రీధర్ గౌడ్,ప్రవీణ్ గౌడ్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

మీడియా టుడే
ఆదివారం, మార్చి 29, 2026

# రాజీ మార్గమే రాజ మార్గం. రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో రాజీ పడవచ్చు

-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రాజగోపాల్.

-ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం

జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి.




**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**
రాజీ మార్గమే రాజా మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, లోక్ అదాలత్ లో రాజీతో ఇరువర్గాలు గెలిచినట్లేనని, లోక్ అదాలత్ తీర్పు, సుప్రీంకోర్ట్ తుది తీర్పుతో సమానమని అన్నారు. లోక్ అదాలత్ లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని అన్నారు. రాజీ మార్గంలో కక్షిదారులు లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకొని తమ కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. కేసులను రాజీతో ముగించేందుకు ఇలాంటి లోక్ అదాలత్ లు ఉపయోగ పడతాయన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయ సేవా సంస్థ సహకారంతో కేసులను పూర్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు.కేసులు రాజీ చేసుకోవడం ద్వారా అప్పీలు చేసుకోవడం ఉండదని, కోర్టు చుట్టూ తిరిగితే సమయం, డబ్బు వృధా అవుతుందని, కేసుల పరిష్కారంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కేసుల సత్వర పరిష్కారంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు. కుటుంబ వివాదాల కేసులలో ముఖ్యమైనవి భార్యాభర్తల కేసుల వివాదాలలో ఇద్దరు కలిసి ఉంటే, వారి సంతానంతో పాటు ఇరువర్గాల కుటుంబాలు కూడా సుఖ సంతోషాలతో ఉండి, ఆరోగ్యమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. గత లోక్ అదాలత్ లో 8490 కేసుల పరిష్కారం చేసి తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా 6వ స్థానంలో నిలిచిందన్నారు. ఇందులో 63 మోటారు వాహన ప్రమాదాల కేసులు పరిష్కరించి, 4 కోట్ల 28 లక్షల 98 వేల రూపాయలు పరిహారం క్రింద అందించామని ప్రధాన నాయమూర్తి తెలిపారు. ప్రస్తుత లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారంలో జిల్లా ఇంకా మెరుగైన స్థానం సాధించాలన్నారు. ఇందుకు భాగస్వాములందరూ లక్ష్య సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదం, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు, ఇతర రాజీపడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసుల పరిష్కారంతో కక్షిదారుల మధ్య సుహృద్భావ వాతావరణం తో పాటు, గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ లో ఒకరు గెలవడం, ఒకరు ఓడడం ఉండదని, ఇద్దరు విజేతలేనని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, భేషజాలకు పోకుండా, ఇరువర్గాల గెలుపు లోక్ అదాలత్ లో ఉంటుందని అన్నారు. పగ, ద్వేషం, కక్ష, ప్రతీకారం ఉంచుకోవద్దని, మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని, శత్రువునైనా ప్రేమించే తత్వం అలవర్చుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో మోటార్ వాహన కేసుకు సంబంధించి ఇన్స్యూరెన్స్ కంపెనీ నుండి ప్రమాద మరణానికి సెటిల్ మెంట్ కు సంబంధించి, ఫ్యామిలీ కేసుకు సంబంధించి పరిష్కారం చేసి, అవార్డు తోపాటు పూల మొక్కలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బహుకరించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి, సీనియర్ సివిల్ జడ్జ్, న్యాయ సేవా సదన్ ఇంచార్జ్ కార్యదర్శి కల్పన, తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ శ్రీనివాసరావు, న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, మీడియేటర్స్, న్యాయవాదులు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలి

**జాతీయ లోక్ అదాలత్ లో 3,268 కేసుల పరిష్కారం. న్యాయమూర్తి ఆంజనేయులు**



పెండింగ్ లో ఉన్న కేసులు రాజీ పడదగిన సివిల్ మరియు క్రిమినల్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కారం చేసుకోవాలని రాజేంద్రనగర్ మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా అదనపు జడ్జి ఆంజనేయులు తెలియజేసారు. ఈ నెల 23 నుండి 28 వరకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ కోర్టు భవనముల సముదాయం లో నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 3,268 కేసులను పరిష్కరించారు, వాటిలో రాజీ పడిన కేసులు 174, అడ్మిషన్ కేసులు 435, విద్యుత్ చౌర్యం కేసులు 142, డ్రేంకన్ డ్రైవ్ కేసులు 2428 పరిష్కరించారు, ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి రాధిక, అదనపు న్యాయమూర్తులు నీలిమ, నరేష్, రత్నకుమారి, శోభ, వేణుగోపాల్ రెడ్డి, ఏపిపిలు క్రిష్ణ మూర్తి, ప్రవీణ్ నాయక్, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాసోజు యాదగిరి, కార్యదర్శి బందయ్య, లోక్ అదాలత్ సభ్యులు, పాండురంగా రెడ్డి, ప్రవీణ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, సుదర్శన్, వెంకట్ రెడ్డి, వరప్రసాద్, శ్రీనివాసులు, సుజాత, సుధాకర్ రెడ్డి, శ్రీ శైలం, జ్ఞనేశ్వర్ చారి, కోర్టు సిబ్బంది సునీత, సత్యనారాయణ, రవీందర్, వెంకట రంగారెడ్డి, నరేష్ గౌడ్ మరియు న్యాయవాదులు ఇతరులు పాల్గొన్నారు

# ఓంకారేశ్వర స్వామి ఆలయానికి భూమి చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**మూసినది సుందరీకరణమే కాదు మన సంస్కృతి కాపాడుకోవడమే ముఖ్య లక్ష్యం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రంగారెడ్డి జిల్లా మీడియా టుడే ప్రతినిధి మార్చ్28**
మూసీ నది పునరుజ్జీవనం కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు, మన సంస్కృతిని కాపాడుకోవడం కూడా!రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మంచిరేవులలో మూసీ నదీ తీరాన వెలసిన పురాతన ఓంకారేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఈరోజు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు మరియు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారితో కలిసి భూమిపూజ లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ శంకుస్థాపన కార్యక్రమం ఆ దైవ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ మేలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.ఆధ్యాత్మిక శోభతో పాటు మూసీ తీరం మళ్ళీ పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.ప్రజల పట్ల నిబద్ధత, సంకల్పం మరియు చిత్తశుద్ధితో కూడిన పాలనే లక్ష్యం. ప్రజలే దైవంగా, వారి ఆదేశాల మేరకు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగడం జరుగుతోంది...

## జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

**డీఈఓ రమేష్ కుమార్**





**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి మార్చి 28**
నాగర్ కర్నూల్ జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ అన్నారు. శనివారం కల్వకుర్తి, తాడూర్, మండలాలోని కల్వకుర్తి జేపీ నగర గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, తాడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను డిఈవో రమేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను, సీసీ కెమెరా వ్యవస్థను ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, బందోబస్తు, తాగునీరు, ప్రథమ చికిత్స వసతి తదితర విషయాలపై ఆరా తీశారు.విద్యార్థులకు ఇలాంటి ఇబ్బందులు కలకుండా ఏర్పాటు చేయాలని డిఇఓ అధికారులు ఆదేశించారు. నేడు జరిగిన గణిత పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 60 పరీక్షా కేంద్రాల్లో 10650 మంది విద్యార్థులకు గాను 10630 మంది విద్యార్థులు నేటి గణిత పరీక్షకు హాజరు కాగా 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. 99.81 % హాజరు శాతం నమోదయిందని, అదేవిధంగా ఆరు మంది ప్రైవేటు విద్యార్థులకు గాను విద్యార్థులు నేటి పరీక్షకు 6 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు.అదేవిధంగా కల్వకుర్తి పట్టణంలోని ప్రాథమికున్నత పాఠశాల హనుమాన్ నగర్, ప్రాథమిక పాఠశాల హరిజన్ వాడి పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల హాజరు ఉపాధ్యాయుల హాజరు విద్యార్థుల ప్రమాణాలను పరిశీలించారు

## భారతీయుల శక్తిని తెలియజేసిన గేయం వందేమాతరం

**ఉస్మానియా యూనివర్సిటీ మాథమాటిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ**

**రంగారెడ్డి జిల్లా మీడియా టుడే ప్రతినిధి మర్చి28**
భారతీయుల శక్తిని తెలియజేసిన గేయం వందేమాతరం అని మహానగర ప్రాముఖ్ డాక్టర్ రామకృష్ణ అన్నారుఈరోజు శంషాబాద్ జిల్లా కేంద్రంలోని వై ఎన్ ఆర్ గార్డెన్లో వందేమాతరం 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఏబీవీపీ శంషాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామూహిక వందేమాతర గేయాలాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మహానగర ప్రాముఖ్ డాక్టర్ రామకృష్ణ గారు మరియు ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ కోటి ప్రదీప్ , జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "వందేమాతరం 150వ చారిత్రక ఘట్టానికి మనం సాక్షులుగా నిలిచామన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల నిబద్ధతను తెలియజేయడంతో పాటు భావితరాలకు కూడా ఉపయోగపడుతుందన్నారు. దేశం సర్దార్ పటేల్, బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలను జరుపుకొంటోందన్నారు. వందేమాతరం రాసిన వేళ భారత్ బానిసత్వంలో ఉందన్నారు. దానికి 100 ఏళ్లు పూర్తయిన వేళ భారత్ రాజ్యాంగం గొంతు నొక్కేశారన్నారు. ఏ వందేమాతరం భారత్ కు స్వేచ్ఛావాయువులు ఇచ్చేందుకు ఉపయోగపడిందో.. దాని 100 ఏళ్ల సమయంలో చీకటికాలం నడిచిందన్నారు. 1947లో ఇదే గేయం మనకు స్వాతంత్ర్యం ఇప్పించిందన్నారు.వందేమాతరం కేవలం రాజకీయ స్వేచ్ఛా మంత్రం కాదన్నారు. వేదకాలం నుంచి ఈ భూమి నా తల్లి, నేను భూమి పుత్రుడను అని చెబుతుందన్నారు. బ్రిటిష్ వారు భారతీయుల్లో ఆత్మన్యూనత నింపేశారన్నారు. ఆ సమయంలో బంకించంద్ర ఛటర్జీ భారతీయుల శక్తిని తెలియజేసేలా ఈ గీతాన్ని రచించారన్నారు. పరాయి పాలనలో ఉన్న భారతీయుల్లో ఇది ఎన్నో ఆశలు నింపిందన్నారు. తమ పోరాటం కేవలం భూమి, అధికారం కాదని.. బానిసత్వ సంకెళ్లను తెంచుకొని సంస్కృతిని పునరుజ్జీవింపజేయడానికే అన్న సందేశాన్ని ఇచ్చిందన్నారు ఆంగ్లేయులు విభజించి పాలించే మార్గాన్ని ఎంచుకొన్నారన్నారు. ఇందుకు




బెంగాల్ ను ప్రయోగశాలగా మార్చారన్నారు. వారికీ తెలుసు.. బెంగాల్ శక్తి దేశానికి ప్రేరణగా నిలుస్తుందని. అందుకే ఆ రాష్ట్రాన్ని ముక్కలు చేస్తే.. దేశం విడిపోతుందని అంచనా వేశారన్నారు. దీనికి అనుగుణంగానే బెంగాల్ విభజన జరిగిందన్నారు. బ్రిటిష్ వారు ఈ పాపం చేసిన సమయంలో వందేమాతరం ఓ శిలలా ఎదురొడ్డి నిలిచిందన్నారు. ఆ నినాదమే ప్రజల్లో ప్రేరణ నింపిందన్నారు. ఇది భారత్ బలహీనపడకుండా.. మరింత బలోపేతం చేసిందన్నారు. బెంగాల్ విభజన జరిగినా.. ఓ పెద్ద స్వదేశీ ఉద్యమం పుట్టుకొచ్చిందన్నారు. వందేమాతరం అన్నిచోట్ల మార్మోగింది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ కుమార్, గర్ల్స్ కో కన్వీనర్ మేఘన, టౌన్ జాయింట్ సెక్రటరీ సంతోష్, పవన్, వేణు చారి, చైతన్య, భరత్, పవన్, మహేష్, యశ్వంత్, కార్యకర్తలు పాల్గొన్నారు...

## ఎక్సైజ్ సుంకం తగ్గింపు వెనుక భారీ కుట్ర

**సిపిఐ రాష్ట్ర నాయకుడు ధూళిపాల ధనుంజయ నాయుడు ఆరోపణ**

**( సూర్యాపేట జిల్లా)// హుజూర్ నగర్ : మీడియా టుడే మార్చి 28 :**
పెట్రోలు,డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలు తగ్గించడం వెనుక భారీ కుట్ర దాగి ఉన్నదని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు ఆరోపించారు. శనివారం ఆయన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల కేంద్రంలో మండల సిపిఐ కార్యదర్శి ముళ్ళ జానయ్య నేరేడుచర్ల మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాస్ రెడ్డితో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఏప్రిల్ నెలలో పశ్చిమబెంగాల్,, తమిళనాడు,కేరళ,అసోం, పుదుచ్చేరి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపధ్యంలో ఒక్కసారిగా ప్రజలపై కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ఎక్కడలేని ప్రేమ పుట్టుకొచ్చిందని ఆ ఎన్నికల కారణం గానే ఎక్సైజ్ సుంకాలు తగ్గించారని ఆయన విమర్శించారు. నిజానికి కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఏప్రిల్ 30 వరకు ఆగి ఆ తర్వాత ఎక్సైజ్ తగ్గిస్తే ఆ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే వాళ్ళని గతంలో కూడా అనేక సందర్భాలలో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ భారతదేశంలో ఎందుకు తగ్గించలేదని, గత 12 సంవత్సరాలలో 7 వేర్వేరు సందర్భాల్లో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ భారతదేశంలో వినియోదారులకు ధరలు తగ్గలేదని, ప్రస్తుతం డీలర్లకు, వినియోగదారులకు ధరలు యధావిధిగానే ఉన్నాయని, వాస్తవానికి తగ్గించింది ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం మాత్రమే అని ఇది ఆయిల్ కంపెనీలు ప్రభుత్వానికి చెల్లించే



పన్నులు అని "ప్రత్యేక " అదనపు " అనే పదాలే ఈ పన్నులు ఎంత అనవసరమో తెలియజేస్తున్నాయని పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం ప్రారంభమైన దగ్గరనుంచి కంపెనీలు నష్టాలను భరిస్తున్నాయని దాదాపు నెలరోజుల తర్వాత ప్రత్యేక అదనపు సుంకాలు తగ్గించడం ద్వారా ఆ భారాన్ని కొంతమేర పంచుకోవడానికి ప్రభుత్వం అంగీకరించిందని దీనివల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పెట్రోలియం ధరలు తగ్గించలేదని తప్పుడు ప్రచారం చేసి ఓట్లు దండుకోవాలి అని దుర్బుద్ధి మాత్రమే కనిపిస్తుందని నిజానికి వినియోగదారుడికి ఒరిగింది ఏమి లేదని ఆయన స్పష్టంగా తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ చారిత్రక మోసాన్ని ప్రతి ఓటరు,ప్రతి పౌరుడు గమనంలో ఉంచుకోవాలని ప్రతి ఎన్నికల్లో కూడా పాకిస్తాన్ బూచిని,చైనా బూచిని చూపించి ఉగ్రవాద బూచిని చూపించి ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్నారని ఇటీవల బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఢిల్లీలో బాంబు పేలిందని ఇక ఆ తర్వాత దాని గురించి మాట్లాడే నాథుడే లేదని ఇదంతా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బిజెపి దాని మిత్రపక్షాలు చేస్తున్న కుయుక్తులుగా ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు.

# సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత



**రాయికల్-మీడియా టుడే-మార్చి 28:**
రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఆరుగురికి.... మూటపెల్లి గ్రామానికి చెందిన ఒక్కరికి లక్ష యానభై వేల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం జగిత్యాలలోని తన కార్యలయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ అందజేశారు. ఈ కార్యకమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బర్కం మల్లేష్, ప్రధాన కార్యదర్శి కొండపల్కుల రత్నాకర్ రావు, నాయకులు అనుమల్ల మహేష్, పడాల సత్యం, కిషన్ రావు, రాజేందర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, రఘునాథ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు 9,540 ఎంబీబీఎస్ సీట్లు

**ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ప్రశ్నకు లోకసభలో వివరాలు వెల్లడించిన కేంద్రం**

**దేశవ్యాప్తంగా సీట్ల పెంపునకు చర్యలు తీసుకున్నట్లు వివరణ**



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**
తెలంగాణలో వైద్య విద్య సీట్ల వివరాలను కేంద్ర ప్రభుత్వం లోకసభలో వెల్లడించింది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 9,540 ఎంబీబీఎస్ (యు జి ) సీట్లు, 3,997 పీజీ సీట్లు అందుబాటులో ఉన్నట్లు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ ఎంసీ ) సమాచారం ఆధారంగా తెలిపారు.

**దేశవ్యాప్తంగా పరిస్థితి ఇలా**
దేశంలో మొత్తం 1,28,976 ఎంబీబీఎస్ సీట్లు, 85,839 పీజీ సీట్లు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. వైద్య విద్యకు భారీ డిమాండ్ ఉండగా, సీట్ల పెంపుపై చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది.నీట్ కు లక్షల్లో పోటీ2025లో నీట్ (యు జి )కు 22,76,069 మంది నమోదు, 22,09,318 మంది హాజరు కాగా, 2026లో 22,79,724 మంది నమోదు చేసుకున్నారని వెల్లడించారు. నీట్ -పి జి 2025కు దాదాపు 2.42 లక్షల మంది హాజరైనట్లు తెలిపారు.

**సీట్ల పెంపునకు చర్యలు**
దేశవ్యాప్తంగా కొత్త మెడికల్ కాలేజీల స్థాపనకు కేంద్రం అనుమతులు ఇచ్చింది. మొత్తం 157 కాలేజీలకు ఆమోదం లభించగా, అందులో 137 ఇప్పటికే పనిచేస్తున్నాయి. అదనంగా 83 కాలేజీలలో 4,977 ఎంబీబీఎస్, 4,058 పీజీ సీట్లు పెంపుకు ఆమోదం ఇచ్చారు.ప్రభుత్వ ఆసుపత్రులు, పీజీ ఇన్స్టిట్యూట్లలో 5,000 పీజీ, 5,023 ఎంబీబీఎస్ సీట్లు సృష్టించే ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు.

# పశు వైద్య శిబిరం



**రాయికల్-మీడియా టుడే-మార్చి 28:**
రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ గ్రామంలో మండల పశు సంవర్ధకశాఖ...భూపతిపూర్ సబ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం పశు వులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఇందులో 102పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మానస సాయిరాజ్, ఉపసర్పంచ్ భూక్యా శంకర్, పశు వైద్య సిబ్బంది మహమ్మద్ ఆజం ఖాన్, ఎల్ఎస్ఏ గంగాచారి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ గంగారాం, రైతులు లింగారెడ్డి, మధు, దుబ్బరెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ధాత్రుత్వం చాటుకున్న చిన్ననాటి స్నేహితులు

**మీడియా టుడే మార్చ్ 28**
**కోదాడ (అనంతగిరి)**



అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామానికి చెందిన కొరివి సత్యనారాయణ (43)అనారోగ్య కారణాలతో గత కొద్దిరోజుల క్రితం మరణించడం జరిగినది. విషయం తెలిసిన తన చిన్న నాటి 10 వ తరగతి మిత్రులు అందరూ కలసి సత్యనారాయణ కుటుంబానికి ఆర్థిక సహాయం గా 45000 వేల రూపాయిలు, కిరాణ సరుకులతో పాటు బియ్యం అందించి అండగా నిలిచి తమ మిత్రుని యెడల ధాత్రుత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమం లో నరసింహారావు, నాగరాజు, రాజశేఖర్, శ్రీను, దణమూర్తి,నరసింహాచారీ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుమట్లలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు

**-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు.**

**-ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదల సంక్షేమానికి ప్రాధాన్యం.**

**-విద్యుత్, త్రాగునీటి సదుపాయాల పనులు పూర్తి.**

**-లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలి.**

**-వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల.**



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**
వెలుగుమట్ల భూదాన్ భూముల్లో లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో కూడిన మోడల్ కాలనీగా అభివృద్ధి చేసి పేదలకు గౌరవప్రదమైన జీవన వాతావరణం కల్పిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మ్యాప్ ద్వారా వివరిస్తూ కాలనీలో ఇప్పటికే విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వీధి దీపాల పనులు పూర్తి అయ్యాయని, వాటర్ ట్యాంక్ నుండి ఇంటింటికీ త్రాగునీటి పైప్‌లైన్ అనుసంధానం జరుగిందని తెలిపారు. అలాగే అంతర్గత రోడ్ల నిర్మాణం, రవాణా సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల మౌళిక అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి కుటుంబానికి త్రాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు సమగ్రంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత పది సంవత్సరాల కాలంలో పేదలు మౌళిక సదుపాయాల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇందిరమ్మ ప్రభుత్వంలో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నాణ్యమైన గృహ నిర్మాణం పూర్తి చేయించడమే లక్ష్యమని అన్నారు.వెలుగుమట్ల కాలనీలో విద్యుత్, త్రాగునీరు, రోడ్లు, కాలువలు, పారిశుద్ధ్య వ్యవస్థ వంటి అన్ని సదుపాయాలు సమగ్రంగా ఏర్పాటు చేసి ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. కాలనీలో స్కూల్, కమ్యూనిటీ హాల్, పార్క్ వంటి సామాజిక వసతులను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అంతర్గత రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. నెలలోపు డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేయాలని, వర్షాకాలం కాలనీలో నీటి నిలువ సమస్యలు ఉండకూడదని మంత్రి ఆదేశించారు.హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసుకోవాలని మంత్రి సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేస్తూ, నిర్దేశిత గడువులోనే అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయలనాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఆర్‌డబీ ఎస్‌ఈ యాకుబ్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు డి. జయచందర్, సైదులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుట్టు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

**స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలి - కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాప్ రిపోర్టర్ . మీడియా టుడే , మార్చి 28**
కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో తంగళ్ళపల్లి మండలంలోని టెక్స్టైల్ పార్కులో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మహిళలకు కుట్టు శిక్షణ కొనసాగుతుండగా, కలెక్టర్ శనివారం పరిశీలించారు.కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు? ఎన్ని రోజులుగా శిక్షణ పొందుతున్నారు? శిక్షణలో ఏ ఏ మెలుకువలు అందిస్తున్నారు అనే అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు.అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో అందించే శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. శిక్షణలో అందించిన మెలకువలు యూనిఫాంలు, డ్రెస్సులు, ఇతర క్లాత్ ఉత్పత్తుల తయారీలో వినియోగించాలని పేర్కొన్నారు. ఆర్థికంగా రాణించి మిగతా వారికి ఆదర్శంగా నిలువాలని కలెక్టర్ ఆకాంక్షించారు. టెక్స్టైల్ పార్కులోని పలు యూనిట్లలో ప్రభుత్వ విద్యాలయాల విద్యార్థులకు అందించే స్కూల్ యూనిఫామ్ క్లాత్ మరమగ్గాలపై సిద్ధమవుతుండగా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఉత్పత్తి ఎప్పటి వరకు పూర్తవుతుంది? ఎప్పటిలో గా సిద్ధం చేసి విద్యార్థులకు అందిస్తారని అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన లక్ష్యం పూర్తి చేయాలని యూనిఫాంలు కుట్టించి విద్యార్థులకు అందించే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పరిశీలన లో చేనేత జౌళి శాఖ ఏడీ సంతోష్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు, ఎంపీఓ మీర్జా, చేనేత జౌళి శాఖ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**తెలుగుదేశం పార్టీ నేత మండవ వెంకటేశ్వర్లు గౌడ్ పిలుపు**

**( సూర్యాపేట జిల్లా)// హుజూర్ నగర్ : మీడియా టుడే మార్చి 28 :**
తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 44 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మార్చి 29 ఆదివారం హుజూర్ నగర్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. హుజూర్ నగర్ నియోజకవర్గంలో ఉన్నటువంటి ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం, పార్టీ జెండాలను ఆవిష్కరించడం మరియు కేక్ కటింగ్ లాంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు మండవ వెంకటేశ్వర్లు గౌడ్ నియోజకవర్గ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హుజూర్ నగర్ పట్టణంలో భారీ బైక్ ర్యాలీతో పాటు కోదాడ రోడ్డు లోని ఎన్టీఆర్ విగ్రహంకు మరియు టౌన్ హాల్ లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం కు నివాళులర్పించడం , భారీ కేకు కటింగ్ కార్యక్రమం తో పాటు అన్నదాన కార్యక్రమం ఉన్నందున నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ అభిమానులు, సానుభూతిపరులు , నందమూరి, నారా వంశ వీరాభిమానులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ పార్టీ అధ్యక్షులు కొమ్మ గాని



వెంకటేశ్వర్లు గౌడ్, టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి , సీనియర్ నాయకులు తమ్మిశెట్టి రాములు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చల్లా వంశీ , హుజూర్ నగర్ మండల పార్టీ అధ్యక్షులు కాష్టాల కనక రత్నం , తెలుగు యువత పట్టణ పార్టీ అధ్యక్షులు నందిగామ నగేష్ , టి ఎన్ టి యు సి నాయకులు గుండెబోయిన వెంకన్న యాదవ్, సీనియర్ నాయకులు వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారాముల శోభ యాత్ర



**రాయికల్-మీడియా టుడే-మార్చి 28:**
రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో శనివారం హనుమాన్ దీక్ష పరులు శ్రీ సితారామ స్వామి, ఆంజనేయులు స్వామిల శోభ యాత్ర ఘనంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. జై శ్రీరామ్ జై శ్రీరామ్ అంటూ శోభాయాత్ర సాగగా ....మహిళలు మంగళహారతులతో, పూలమాలలతో, కొబ్బరికాయలు కొట్టుకుంటూ స్వామివారికి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ దీక్ష స్వాముల కాళ్లకు భక్తులు జలాభిషేకం చేశారు. జక్కుల గురు మల్లారెడ్డి, ఇద్దం తిరుపతి రెడ్డి, పల్లికొండ రవి కిరణ్, భంటి, నవీన్, అనుమల్ల సత్యనారాయణ, మర్రి సురేష్, కుందురు రేవంత్, కటుకం సురేష్, రమేష్, రాజేందర్, నారాయణ, కమలాకర్, జగన్, ప్రవీణ్, నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**కరపత్రం ఆవిష్కరణ.**
మండలంలోని రామాజీపేట గ్రామంలో నాయకులు హిందూ సమ్మేళన కరపత్రం అవిష్కరించారు. ఈ కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ విశోక తీర్థ స్వామి అనుగ్రహం భాషణం చేస్తారని, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ్ గోల్కొండ నాగరాజులు సనాతన ధర్మం గూర్చి మార్గదర్శనం చేస్తారని, అలాగే శ్రీగోపూజ, సామూహిక శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుందని హిందు సమ్మేళన సమితి బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు అయిలేని రాజరెడ్డి, ప్రధానకార్యదర్శి గోనె గుర్రు మల్లారెడ్డి, కోశాధికారి దుగ్యాల రమాపతి రావు, సర్పంచ్ బెజ్జంకి మోహన్, ఉపసర్పంచ్ ఇద్దం సుధీర్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కోల రాజు తదితరులు పాల్గొన్నారు.

మీడియా టుడే

ఆదివారం, మార్చి 29, 2026

# జలమండలి లోగో దుర్వినియోగంపై కఠిన చర్యలు

- ప్రైవేట్ ట్యాంకర్లపై క్రిమినల్ కేసులు నమోదు
- ప్రజలను తప్పుదారి పట్టించే చర్యలపై హెచ్చరిక
- అధికారిక సేవల ద్వారానే నీటి బుకింగ్ చేయాలని సూచన

**హైదరాబాద్, మార్చి 28**

హైదరాబాద్ జలమండలి లోగోను అనధికారికంగా వినియోగిస్తున్న ప్రైవేట్ నీటి ట్యాంకర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఇటీవల కొందరు వ్యక్తులు జలమండలి అధికారిక గుర్తింపు చిహ్నాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.జలమండలి లోగో అనేది ప్రభుత్వ అధికారిక గుర్తింపు చిహ్నమని, దీనిని అనుమతి లేకుండా వినియోగించడం చట్ట విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. ప్రైవేట్ ట్యాంకర్లు ఈ లోగోను ఉపయోగించడం వల్ల ప్రజలు వాటిని ప్రభుత్వ సేవలుగా భావించే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఇది మోసపూరిత చర్యగా పరిగణించబడుతుందని పేర్కొన్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా సరఫరా అయ్యే నీరు సాధారణంగా బోర్‌వెల్‌ల నుంచి సేకరించబడుతుందని, అది జలమండలి ప్రమాణాల ప్రకారం శుద్ధి చేయబడినది కాదని అధికారులు తెలిపారు. ఈ నీటి నాణ్యతపై పరీక్షలు కూడా జరగకపోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్లను బుక్ చేసుకునే సమయంలో అధికారిక మార్గాల ద్వారానే బుక్ చేసుకోవాలని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్ 155313 ద్వారా మాత్రమే సురక్షితమైన, శుద్ధి చేయబడిన నీటిని పొందవచ్చని తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీలలో ఒక ప్రైవేట్ ట్యాంకర్ జలమండలి లోగోను అనధికారికంగా వినియోగిస్తున్నట్లు గుర్తించి, ఆ ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకున్న ఎండీ అశోక్ రెడ్డి, లోగో దుర్వినియోగం ఎక్కడ జరిగినా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ఇలాంటి ఘటనలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. మొత్తంగా జలమండలి సేవలపై ప్రజల నమ్మకాన్ని కాపాడేందుకు, అక్రమ చర్యలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# మందమర్రిలో కాస్మోటాలజీ శిక్షణ పూర్తి

- అభ్యర్థులకు సర్టిఫికెట్లు
- సింగరేణి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో కార్యక్రమం
- 31 మందికి శిక్షణ -- మహిళలకు ఉపాధి అవకాశాలు
- స్వయం ఉపాధి దిశగా ముందడుగు

**మందమర్రి, మార్చి 28**

మందమర్రిలోని సింగరేణి సంస్థ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన కాస్మోటాలజీ కోర్సును పూర్తి చేసిన అభ్యర్థులకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, మందమర్రి సేవ అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ పాల్గొన్నారు.15 రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో మొత్తం 31 మంది అభ్యర్థులు పాల్గొని కాస్మోటాలజీ రంగంలో ప్రావీణ్యం సాధించారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలు విస్తరించాయని అధికారులు పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా వారు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ఈ శిక్షణ దోహదపడిందని తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్యాలు అందించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని చెప్పారు.శిక్షణ పొందిన అభ్యర్థులు ఈ అవకాశంపై సంతోషం వ్యక్తం చేస్తూ, తమ భవిష్యత్తుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తంగా ఈ కార్యక్రమం మహిళల సాధికారతకు తోడ్పడుతూ, ఉపాధి అవకాశాలను పెంపొందించే దిశగా కీలక పాత్ర పోషిస్తోంది.

# ఝార్ఖండ్‌లో ఉపరాష్ట్రపతి తొలి పర్యటన

**ఉలిహాటు గ్రామంలో బిర్సా ముండా కు నివాళులు**

**సైనిక గౌరవంతో ఘన స్వాగతం- గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

**ఝార్ఖండ్, మార్చి 28**

భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ తన పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారి ఝార్ఖండ్ రాష్ట్రాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా ఖుంటి జిల్లాలోని ఉలిహాటు గ్రామానికి చేరుకుని, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జన్మస్థలాన్ని దర్శించి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఉలిహాటు గ్రామం బిర్సా ముండా జన్మస్థలంగా చారిత్రాత్మక ప్రాధాన్యతను కలిగి ఉంది. ఆయన గిరిజనుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడిగా గుర్తింపు పొందారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ముఖ్య అధ్యాయంగా నిలిచింది. ఉపరాష్ట్రపతి ఈ నేపథ్యంలో అక్కడికి వెళ్లి ఆయనకు నివాళులు అర్పించడం ప్రత్యేకంగా భావించబడుతోంది. ఉపరాష్ట్రపతి గ్రామానికి చేరుకున్న వెంటనే స్థానిక ప్రజలు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ రీతిలో గిరిజన కళారూపాలతో ఆయనకు ఆతిథ్యం ఇచ్చారు. గ్రామ ప్రజలతో కలిసిమెలిసి మాట్లాడిన ఆయన, వారి జీవన విధానాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆయన రాక సందర్భంగా భద్రతా దళాలు గార్డు ఆఫ్ హానర్ అందజేశాయి. సైనిక గౌరవంతో జరిగిన ఈ స్వాగత కార్యక్రమం ఎంతో ఘనంగా సాగింది. అధికార యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించింది. ఈ దృశ్యాలు అక్కడికి వచ్చిన ప్రజలను ఆకట్టుకున్నాయి.ఈ సందర్శన ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందనే సంకేతాలు వెల్లడయ్యాయి. గిరిజనుల సామాజిక, ఆర్థిక పురోగతికి తీసుకుంటున్న చర్యలను మరింత బలోపేతం చేయాలనే సంకల్పం ఈ పర్యటనలో ప్రతిబింబించింది. మొత్తంగా ఉపరాష్ట్రపతి పర్యటన ఝార్ఖండ్ రాష్ట్రంలో ఉత్సాహాన్ని నింపింది. గిరిజన సమాజం పట్ల గౌరవం, వారి చరిత్ర పట్ల గుర్తింపు ఇవ్వడంలో ఈ సందర్శన ఒక కీలక ఘట్టంగా నిలిచింది. స్థానిక ప్రజలు ఈ పర్యటనను సంతోషంతో స్వాగతించారు.

# సామ్రాజ్యవాద యుద్ధాలతో సామాన్యులపై భారం

- వ్యాపార దృక్పథంతోనే అమెరికా యుద్ధం - అమెరికా ఆర్థిక వ్యవస్థ కూ యుద్ధం ఓ సవాలే..!
- భవిష్యత్తులో తీవ్రం కానున్న ఎరువుల కొరత - అమెరికా చెప్పినట్లు ఆడుతున్న మోడీ
- సామ్రాజ్యవాద యుద్ధం - ప్రజలపై ప్రభావం' సెమినార్‌లో ఆర్థిక, సామాజిక విశ్లేషకులు డి. పాపారావు, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు.








**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి:-**

సామ్రాజ్యవాద అమెరికా, ఇజ్రాయిల్-ఇరాన్‌పై చేస్తున్న యుద్ధంలో కాలి బూడిద అవుతున్నది యుద్ధ ట్యాంకులు, మిస్సైల్స్, డ్రోన్స్ మాత్రమే కాదు, మూడో ప్రపంచ దేశాల్లోని కార్మికులు -- కర్షకులు, సామాన్యుల శ్రమశక్తి అని ఆర్థిక సామాజిక విశ్లేషకులు డి. పాపారావు పేర్కొన్నారు. దేశీయ ఇంధన అవసరాలను 80% పైగా దిగుమతి పై ఆధారపడడంతో యుద్ధం వలన ప్రధానంగా ప్రభావమవుతున్న దేశాలలో మన దేశం ఒకటి అన్నారు. వ్యాపార దృక్పథంతోనే అమెరికా ఈ యుద్ధం చేస్తోందన్నారు. బోడేపూడి విజ్ఞాన కేంద్రం (బీవీకే), ఖమ్మం ఆధ్వర్యంలో స్థానిక మంచికంటి ఫంక్షన్ హాల్ లో శనివారం ఏర్పాటు చేసిన ‘ సామ్రాజవాద యుద్ధం - ప్రజలపై ప్రభావం’ సెమినార్ లో పాపారావు ముఖ్య వక్తగా మాట్లాడారు. హర్మూజ్ జల సంధి మూసివేతతో ఇంధన దిగుమతులతోపాటు పశ్చిమాసియా దేశాలకు ఎగుమతయ్యే ఫార్మా ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ గూడ్స్ పైన ప్రభావం పడిందన్నారు. ఫార్మా, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల కంటైనర్‌పై వార్ సెస్ కింద అదనంగా రూ.రెండు లక్షలు వసూలు చేస్తున్నారని తెలిపారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం తెలంగాణలోని ఉత్పాదక పరిశ్రమల కార్మికులపై ప్రభావం చూపుతోందన్నారు. ముఖ్యంగా ఎల్.ఎన్.జి వంటి ముడి పదార్థాల కొరత ఏర్పడటంతో పరిశ్రమలు ఉత్పత్తిని తగ్గించుకోవలసి వస్తోందన్నారు. రసాయనాలు, ప్లాస్టిక్‌లు, ఆహార ప్రాసెసింగ్ వంటి పరిశ్రమలు ఉత్పత్తి మందగించాయన్నారు. సిరామిక్, ఉక్కు, వస్త్ర, ఫ్యాబ్రికేషన్ యూనిట్లను పెద్ద ఎత్తున మూసివేయడానికి కారణమవుతోందన్నారు. ఇండస్ట్రియల్ గ్యాసెస్, కెమికల్స్ వంటి ముఖ్యమైన ముడి పదార్థాల కొరతకు దారితీసిందన్నారు. కొన్ని తయారీ యూనిట్లలోని పారిశ్రామిక క్యాంటీన్లు ఇప్పటికే మూతపడ్డాయన్నారు. ఈ అస్థిరత తెలంగాణ నుండి గల్ఫ్ ప్రాంతానికి జరిగే ఎగుమతులకు అంతరాయం కలిగించిందన్నారు. భవిష్యత్తులో ఎరువుల కొరత తీవ్రతరం అవుతుందన్నారు. ఇరాన్ తో యుద్ధానికి దిగేముందే అమెరికా అంచనా గాడి తప్పిందని తెలిపారు. యుద్ధం కారణంగా అమెరికా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. సీఎన్‌జీ కొరతతో అనేకమంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. విదేశాలకు వెళ్తున్న భారతీయులలో దేశంలోని మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాల నుండి అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల కలల సీమలకు వెళ్తున్న వైట్ కాలర్ ఉద్యోగుల కంటే గల్ఫ్ కంట్రీస్‌లో ఉపాధి పొందుతున్న కార్మికులే అధికమన్నారు. గల్ఫ్ (యూఏఈ, ఖతార్, సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్) దేశాలలో సుమారు తొంభై లక్షలమంది భారతీయ కార్మికులు ఉంటే... తెలంగాణ నుండి సుమారు పదిహేను లక్షల మంది కార్మికులు గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్నారన్నారు. భారతదేశ వ్యవసాయ రంగంలో కీలకమైన ఖరీఫ్ సీజన్‌కు ముందు యుద్ధం కారణంగా ఖతార్ నుండి ఎల్ఎన్‌జీ రవాణా నిలిచిపోవడం దేశీయ యూరియా తయారీని ప్రభావితం చేస్తోందన్నారు. యూరియా ఉత్పత్తిలో డెబ్బయి శాతం వ్యయం సహజ వాయువుదేనని తెలిపారు. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సిఎల్)పై గ్యాస్ కొరత ప్రభావం పడిందన్నారు. ఆర్.ఎఫ్.సి.ఎల్ యూరియా ఉత్పత్తిలో దాదాపు సగభాగం రాష్ట్రానికే సరఫరా అవుతుందన్నారు. దేశ ఇంధన అవసరాలను తీర్చడానికి ఇరాన్ సహజ వాయువును పైప్‌లైన్ ద్వారా తీసుకువచ్చే ప్రాజెక్టును అమెరికా ఆంక్షల కారణంగా భారతదేశం వైదొలిగిందన్నారు. ప్రాజెక్టు నుండి వైదొలగకుండా పైప్ లైన్ పూర్తి చేసి ఉంటే, నేడు ఎంతో చౌక ధరకు ఇరాన్ నుండి సహజవాయువు మనకు అందేదని చెప్పారు. ప్రపంచ ఆర్థిక సమస్యలకు పరిష్కారం చూపించేది కమ్యూనిస్టులు మాత్రమే తెలిపారు. భవిష్యత్ కమ్యూనిస్టులు దేనిని అన్నారు.

**- అమెరికా చేతిలో మోడీ కీలుబొమ్మ**

భారతదేశ పాలకవర్గాలు అమెరికన్ సామ్రాజ్యవాదానికి లొంగిపోతున్న కారణంగా నేడు దేశంలోని కార్మికులు, కర్షకులు, సామాన్య ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. వ్యాపార, వాణిజ్య రంగంలో శతాబ్దాలుగా ఇరాన్‌తో భారత్‌కు అనుబంధం ఉందన్నారు. దశాబ్దాలుగా మిత్రదేశాలుగా ఉన్నాయని తెలిపారు. దీనికి భిన్నంగా ప్రస్తుత బీజేపీ నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్, అమెరికన్ సామ్రాజ్యవాదంతో అంటకాగుతోందన్నారు. మన ప్రభుత్వం ఏం చేయాలో, ఎక్కడ సంతకం పెట్టాలో, ఎక్కడ పెట్టకూడదో అమెరికా నిర్ధారిస్తుందన్నారు. బీవీకే జనరల్ మేనేజర్ వై . శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్లో బండారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాట్లకు ముందే రైతుబంధు ఇవ్వాలి

**ఎన్నికల ముందు కాదు-కాంగ్రెస్ రైతు హామీలు వెంటనే అమలు చేయాలి: మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి..**

**గిరిజన రైతులకు ఉచిత కరెంట్, సాగునీటి నిధులపై బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వాలని డిమాండ్..**





**మహబూబాబాద్ జిల్లా బ్యూరో మర్చి 28,మీడియా టుడే.**

కొత్తగూడ మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో జిల్లా నాయకుడు ఈసం సమ్మయ్య నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై, ముఖ్యంగా రైతు సంక్షేమం, గిరిజన రైతుల సమస్యలు, బడ్జెట్ కేటాయింపుల అంశాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, “నాట్లు వేసే ముందు రైతుబంధు ఇవ్వాలి గానీ, ఎన్నికల ముందు రైతులకు గుర్తొచ్చే పథకంగా మార్చకూడదు” అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో, పోస్టర్లలో రైతులకు, పేదలకు, గిరిజనులకు ఎన్నో హామీలు ఇచ్చిందని, ఇప్పుడు వాటిని చట్టబద్ధంగా అమలు చేయాల్సిన పూర్తి బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.అలాగే, ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నుకున్నది బీఆర్ఎస్ పార్టీని రోజూ విమర్శించడం కోసం కాదని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం అని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. రైతుల సమస్యలపై ప్రభుత్వానికి స్పష్టమైన చిత్తశుద్ధి కనిపించడం లేదని, మాటలకే పరిమితమైందని ఆరోపించారు.పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, “కేసీఆర్ గారి నాయకత్వంలో గిరిజనులకు, బలహీన వర్గాల రైతులకు అధికారిక సర్వే చేసి, లాంగిట్యూడ్-లాటిట్యూడ్ పద్ధతిలో పట్టాలు ఇచ్చాం. కొత్తగూడ, గంగారం మండలాల్లో గిరిజన రైతులకు భూ హక్కులు కల్పించాం” అని తెలిపారు. అయితే ప్రస్తుతం గిరిజన రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.ఖజానాలో ఎస్టీ (రూ), ఎస్‌డిఎఫ్ (రాణఖీ) నిధులు ఉన్నప్పటికీ, గిరిజన రైతుల సమస్యలపై సంబంధిత మంత్రి సీతక్క ఇప్పటివరకు సమీక్ష నిర్వహించకపోవడం విచారకరమన్నారు. గిరిజన ప్రాంతాల్లో సాగు, విద్యుత్, భూ హక్కుల అంశాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.రైతులతో కరెంట్ కనెక్షన్ల కోసం డీడీలు (ఠణలు) కట్టించకుండా, వెంటనే ఉచితంగా విద్యుత్ లైన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశానికి రాబోయే బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని, లేకపోతే రైతు సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి పూర్తిగా బయటపడుతుందని హెచ్చరించారు.అలాగే, జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో గిరిజన రైతులకు ఉచిత విద్యుత్, సాగునీటి వనరులకు నిధులు, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. “ఈ బడ్జెట్ సమావేశాల్లోనే సాగుభూములకు నిధులు కేటాయించి అమలు చేయాలి. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదని స్పష్టమవుతుంది” అని అన్నారు.పునర్విభజన అంశంపై కూడా పెద్ది సుదర్శన్ రెడ్డి స్పందిస్తూ, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పునర్విభజనలో ఉమ్మడి కొత్తగూడ మండలాలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కొంతమంది నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మండలాల పునర్వ్యవస్థీకరణను తమ నియోజకవర్గ ప్రయోజనాలకు అనుకూలంగా మార్చుకున్నారని విమర్శించారు.ప్రజల అభిప్రాయం, ప్రాంతీయ అవసరాలు, పరిపాలనా సౌలభ్యం ఆధారంగా మండలాలు, నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరగాలని, ప్రజల ఇష్టానుసారం ప్రాంతాలను సంబంధిత నియోజకవర్గాల్లో కలపాలని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సమావేశంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ దేశిడి శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు, అధికార ప్రతినిధి నెహ్రూ, గజ్జి కొమురెల్లి, రమేష్ నాయక్, కిషన్ నాయక్, కాసర్ల సాంబయ్య, దూదిమెట్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వ దీక్ష

**- చారిత్రక పుణ్యక్షేత్రాల పునర్నిర్మాణానికి శ్రీకారం - పురాతన ఆలయాల అభివృద్ధికి భారీ ప్రణాళికలు**

**- పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా మారనున్న పరీవాహక ప్రాంతం - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**







**హైదరాబాద్, మార్చి 28 ;**

ఎవరెన్ని విమర్శలు, అడ్డంకులు సృష్టించినా మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మానవ తప్పిదాల వల్ల గొప్ప చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరం కనుమరుగయ్యే ప్రమాదం నుంచి కాపాడి, భవిష్యత్తు తరాలకు అత్యద్భుత నగరాన్ని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మూసీ నది శుద్ధి ప్రస్తుతం అత్యవసరమైన అంశమని, దీనిపై ఎలాంటి రాజీ ఉండదని అన్నారు.మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో భాగంగా గండిపేట–మంచిరేవుల ప్రాంతంలోని చారిత్రక వీరభద్రస్వామి ప్రాంగణంలో శ్రీ మచిలేశ్వర స్వామి, శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోవు పూజ చేసి గోశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయాల అభివృద్ధికి సంబంధించిన పూజలు, శంకుస్థాపనలు ఘనంగా జరిగాయి.సుమారు 1400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని దాదాపు 8 ఎకరాల్లో రూ.700 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనతో పాటు ఈ ప్రాంతాన్ని ధ్యానమందిరాలు, సాంస్కృతిక కట్టడాలతో ప్రత్యేక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. మూసీ నది ప్రక్షాళనను ఏ పరిస్థితుల్లోనూ ఆపబోమని, ఇది ప్రభుత్వ దీక్ష అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రామప్ప ఆలయ నమూనాలో నిర్మాణాలు చేపట్టాలని సంకల్పించామని, ఇది యాదృచ్ఛికంగా కాకుండా దైవ సంకల్పంతో జరుగుతున్న కార్యక్రమమని అన్నారు.నదీ పరీవాహక ప్రాంతాలు అభివృద్ధికి కేంద్రబిందువులుగా మారుతాయని చరిత్ర చెబుతోందని, తెలంగాణకు సముద్రతీరం లేకపోయినా నదులను సమర్థంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది కాలుష్యం వల్ల ఏర్పడిన సమస్యలను ఉదాహరణగా తీసుకుని, హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మూసీ ప్రక్షాళనతో పాటు నగరంలో మత సామరస్యాన్ని ప్రతిబింబించే నిర్మాణాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. చార్మినార్ ప్రాంతంలో మసీదు, గౌలిగూడలో సిక్కు దేవాలయం, ఉప్పల్ ప్రాంతంలో చర్చి నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గోదావరి నుంచి నీటి సరఫరా ద్వారా నగర అవసరాలను తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నాలు చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బోయినపల్లి మార్కెట్ దుస్థితిపై ఈటెల రాజేందర్ ఆగ్రహం

**- శాశ్వత పరిష్కారం వరకు ధర్నా హెచ్చరిక - చెత్తతో నిండిన మార్కెట్ యార్డ్‌పై తీవ్ర విమర్శలు**

**- కాంట్రాక్టర్లకు చెల్లింపులేక పనులు నిలిచిపోయిన పరిస్థితి - సమస్య పరిష్కారం వరకు ఉద్యమం కొనసాగిస్తానని స్పష్టం**



**హైదరాబాద్, మార్చి 28**

మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ బోయినపల్లి వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలించి అక్కడి రైతులు, కార్మికులు, వ్యాపారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ దుస్థితిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకప్పుడు ఆదర్శంగా నిలిచిన ఈ మార్కెట్ ప్రస్తుతం చెత్తతో నిండిన డంప్ యార్డ్‌లా మారిందని ఆరోపించారు.సుమారు 24 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ మార్కెట్‌కు రోజుకు దాదాపు 10 వేల మంది కస్టమర్లు వస్తారని, సంవత్సరానికి 14 నుంచి 15 కోట్ల రూపాయల ఆదాయం వచ్చే ప్రాధాన్యత కలిగిన కేంద్రం అని పేర్కొన్నారు. అయితే గత 9 నెలలుగా చెత్త తరలింపు కాంట్రాక్టర్లు, శుభ్రత కార్మికులకు చెల్లింపులు చేయకపోవడం వల్ల వందల లారీల చెత్త పేరుకుపోయిందని తెలిపారు. కుళ్లిపోయిన కూరగాయల వల్ల దుర్గంధం వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మార్కెట్‌లో పరిశుభ్రత పూర్తిగా దెబ్బతిందని, మురుగునీరు కాళ్ల కిందకి వచ్చి పుండు పుట్టించే స్థాయికి చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల కారణంగా కస్టమర్లు రావడం తగ్గి వ్యాపారం దెబ్బతింటోందని పేర్కొన్నారు. మంత్రులు, కమిషనర్‌కు పలుమార్లు తెలియజేసినా సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు.మహిళల కోసం ఉన్న టాయిలెట్ సదుపాయాలు అత్యంత దారుణంగా ఉన్నాయని తెలిపారు. నీరు లేకపోవడం, తలుపులు లేకపోవడం వంటి సమస్యలతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా పనిచేయడం లేదని, నీటి ట్యాంకులు ఉన్నా నీరు అందుబాటులో లేదని వివరించారు. ఆరోగ్యకరమైన మార్కెట్‌గా ఉండాల్సిన ప్రదేశం రోగాల కేంద్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెత్త పూర్తిగా తొలగించడం, డ్రైనేజీ శుభ్రపరచడం, మంచినీటి సరఫరా మెరుగుపరచడం, బయోగ్యాస్ ప్లాంట్ పునరుద్ధరణ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ధర్నా కొనసాగిస్తానని హెచ్చరించారు. అవసరమైతే మార్కెట్‌ను తాత్కాలికంగా మూసివేసి పూర్తిగా శుభ్రం చేయాలని సూచించారు. ప్రభుత్వంపై కూడా ఈటెల రాజేందర్ తీవ్ర విమర్శలు చేశారు. భారీ ప్రాజెక్టులపై దృష్టి పెట్టిన ప్రభుత్వం ప్రాథమిక సదుపాయాలపై నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారులను పంపించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే వేలాది కార్మికులతో కలిసి ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామని స్పష్టం చేశారు.

# ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

**పట్టు వస్త్రాల సమర్పణకు ముఖ్యమంత్రి సిద్ధం**

**భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి - భద్రతా ఏర్పాట్లకు కట్టుదిట్టమైన చర్యలు**



**అమరావతి, మార్చి 28**

రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అమరావతి సచివాలయం నుండి ఉన్నత స్థాయి వర్చువల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఇది ప్రతి సంవత్సరం నిర్వహించే సంప్రదాయ కార్యక్రమంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు విస్తృత ప్రణాళికలు రూపొందిస్తున్నారు.సమీక్షా సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, రాంప్రసాద్ రెడ్డి మరియు సవిత పాల్గొన్నారు. ఉత్సవాల నిర్వహణలో ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా క్యూలైన్లు, పార్కింగ్ సదుపాయాలు, తాగునీటి సరఫరా, అన్నప్రసాదం పంపిణీ, మరియు వైద్య సదుపాయాలను సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను హెచ్చరించారు. ప్రజల రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. భద్రతా పరంగా ఎటువంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం మీద బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సమగ్రంగా సిద్ధమవుతోంది.

## తొలిముద్దను ప్రారంభించిన ముఖ్యమంత్రి

**అంగన్వాడీల్లో పౌష్టికహార లోపం కనిపించొద్దు**

**శాశ్వత భవనాలకు తొలి ప్రాధాన్యత- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ మార్చ్ 28;**

తెలంగాణ రాష్ట్రంలోని అంగన్?వాడీ పిల్లలకు అల్పాహార పథకం 'తొలి ముద్ద'ను శనివారం ప్రభుత్వం ప్రారంభించింది. అసెంబ్లీ కమిటీ హాల్?లో ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ స్కీమ్?లో భాగంగా అంగన్?వాడీ చిన్నారులకు రెడీ టూ కుక్ ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్)ను బ్రేక్ ఫాస్ట్?గా ప్రభుత్వం అందించనుంది. ఈ కార్యక్రమంలో అంగన్?వాడీ వర్కర్స్?కు మొబైల్ ఫోన్?లను రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ సీతా దయాకర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.న్యూట్రిషన్ ఫుడ్ అందడం లేదు : ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ఈ పథకం ప్రారంభోత్సవానికి ఒక మంచి నేపథ్యం ఉందని గుర్తు చేశారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని ఎడ్యుకేషన్, ఇరిగేషన్?కు ప్రాధాన్యత ఇచ్చారని, దేశంలో ప్రస్తుతం ఫుడ్ సెక్యూరిటీ ఉందని, కానీ న్యూట్రిషన్ ఫుడ్ అందడం లేదని తెలిపారు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోందని అన్నారు. ఇప్పుడు బ్రేక్ ఫాస్ట్? పథకాన్ని కూడా ప్రారంభించామని పేర్కొన్నారు.ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తాం : ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా, అమలు చేయాల్సింది అంగన్?వాడీ టీచర్లు మాత్రమేనని, అందుకే ప్రభుత్వం వారిపై గురుతర బాధ్యత పెట్టిందని స్పష్టం చేశారు. అంగన్?వాడీ చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకుని, వారికి పౌష్టికాహారం అందించాలని కోరారు. అంగన్?వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందన్న ఆయన, ఆ శాఖ సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని, ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా వారి సమస్యలనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.ఇక అద్దె భవనలకు చెక్ : ఈ క్రమంలోనే అంగన్?వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదని, సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే వారిలో మానసిక ఎదుగుదల ఉంటుందని, పౌష్టికాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. భవిష్యత్?లో అవే అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయని అన్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు."దేశంలో ప్రస్తుతం ఫుడ్ సెక్యూరిటీ ఉంది. కానీ పౌష్టికాహారం అందట్లేదు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. అంగన్?వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోంది. అంగన్?వాడీ సిబ్బంది సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్?వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలి. ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుంది. పౌష్టికాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయి" ముఖ్యమంత్రి తెలిపారు.

## జలమండలి లోగో దుర్వినియోగంపై కఠిన చర్యలు

**- ప్రైవేట్ ట్యాంకర్లపై క్రిమినల్ కేసులు నమోదు**

**- ప్రజలను తప్పుదారి పట్టించే చర్యలపై హెచ్చరిక**

**- అధికారిక సేవల ద్వారానే నీటి బుకింగ్ చేయాలని సూచన**

**హైదరాబాద్, మార్చి 28**

హైదరాబాద్ జలమండలి లోగోను అనధికారికంగా వినియోగిస్తున్న ప్రైవేట్ నీటి ట్యాంకర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఇటీవల కొందరు వ్యక్తులు జలమండలి అధికారిక గుర్తింపు చిహ్నాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.జలమండలి లోగో అనేది ప్రభుత్వ అధికారిక గుర్తింపు చిహ్నమని, దీనిని అనుమతి లేకుండా వినియోగించడం చట్ట విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. ప్రైవేట్ ట్యాంకర్లు ఈ లోగోను ఉపయోగించడం వల్ల ప్రజలు వాటిని ప్రభుత్వ సేవలుగా భావించే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఇది మోసపూరిత చర్యగా పరిగణించబడుతుందని పేర్కొన్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా సరఫరా అయ్యే నీరు సాధారణంగా బోర్‌వెల్‌ల నుంచి సేకరించబడుతుందని, అది జలమండలి ప్రమాణాల ప్రకారం శుద్ధి చేయబడినది కాదని అధికారులు తెలిపారు. ఈ నీటి నాణ్యతపై పరీక్షలు కూడా జరగకపోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్లను బుక్ చేసుకునే సమయంలో అధికారిక మార్గాల ద్వారానే బుక్ చేసుకోవాలని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్ 155313 ద్వారా మాత్రమే సురక్షితమైన, శుద్ధి చేయబడిన నీటిని పొందవచ్చని తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీలలో ఒక ప్రైవేట్ ట్యాంకర్ జలమండలి లోగోను అనధికారికంగా వినియోగిస్తున్నట్లు గుర్తించి, ఆ ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకున్న ఎండీ అశోక్ రెడ్డి, లోగో దుర్వినియోగం ఎక్కడ జరిగినా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ఇలాంటి ఘటనలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. మొత్తంగా జలమండలి సేవలపై ప్రజల నమ్మకాన్ని కాపాడేందుకు, అక్రమ చర్యలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు.



# ఒకే నెలలో మూడు సినిమాలు.. కృతిశెట్టి మళ్లీ ట్రాక్‌పైకి వచ్చేనా..?

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం. కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. మరి చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.

# హైప్ పెంచుతున్న మాస్టర్ మహేంద్రన్ వసుదేవసుతం టీజర్



దేవి సినిమాతో చైల్డ్ యాక్టర్‌గా సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాడు మాస్టర్ మహేంద్రన్. ఈ టాలెంటెడ్ యాక్టర్ హీరోగా నటిస్తున్న చిత్రం వసుదేవసుతం. వైకుంఠ్ బోను డైరెక్ట్ చేస్తున్నాడు. టాలీవుడ్ యాక్టర్ సత్యదేవ్ ఈ మూవీ టీజర్‌ను లాంచ్ చేశాడు. ఈ కథ ధర్మానికి అడ్డొస్తే మేనమామ అయినా.. లక్షల బంధుగణమైనా.. ఎదురుగా కోట్ల సాయుధులే ఉన్నా.. ధర్మ హింస తథైవచ అన్న శ్రీ కృష్ణుడిదే కాదు.. ధర్మాన్ని కాపాడేందుకు ఎంతటి మారణ హోమానికైనా ఎదురెళ్లే యువకుడిది అంటూ సాగుతున్న డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. గుడి, గుప్త నిధి చుట్టూ తిరిగే సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగనున్నట్టు టీజర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, జాన్ విజయ్, మీమ్‌గోపి, తులసి, టార్జన్, రామరాజు, భద్రమ్, జబర్దస్త్ రాంప్రసాద్, శివన్నారాయణ, దువ్వాసి మోహన్, సుమేత బజాజ్, అంబికావాణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలువబోతున్నట్టు టీజర్ ద్వారా తెలిసిపోతుంది. ఈ మూవీ రిలీజ్ డేట్‌పై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. ఈ చిత్రాన్ని రెయిన్‌బో సినిమాస్ బ్యానర్‌పై ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు.




# అన్నీ ఇక్కడే నేర్చుకున్నా!

'మనస్సినక్కరే' (2003) అనే మలయాళ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది అగ్ర కథానాయిక నయనతార. ఆ తర్వాత తమిళ, తెలుగు భాషల్లో అగ్ర కథానాయికగా పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా 'చంద్రముఖి' 'గజిని' చిత్రాలు ఆమె కెరీర్‌ను మలుపుతిప్పాయి. ఇక అక్కడి నుంచి దక్షిణాదిలో అగ్ర నాయికగా చెలామణీ అయింది. అభిమానులు ఆమెను లేడీసూపర్‌స్టార్ అని ప్రేమగా పిలుస్తుంటారు. నయనతార ఇండస్ట్రీకి వచ్చి నేటితో 22 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ భామ అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఓ నోట్‌ను విడుదల చేసింది. 'నేను కెమెరా ముందుకొచ్చి 22ఏండ్లు గడచిపోయాయి. ఈ ప్రయాణం ఇంతదూరం సాగుతుందని అస్సలు ఊహించలేదు. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాతే వృత్తిపరంగా, వ్యక్తిగతంగా పరిణితి లభించింది. ఇక్కడే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా. ఓ రకంగా సినీరంగం నాలో ధైర్యాన్ని నింపింది. నన్ను కొత్తగా పరిచయం చేసింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన అభిమానులందరికి కృతజ్ఞతలు' అని నయనతార పేర్కొంది.

# ఆ చాన్స్ వస్తే బాగుంటది!

'సాధారణంగా ఇద్దరమ్మాయిలు, ఓ అబ్బాయి అంటే ముక్కోణపు ప్రేమకథ అనుకుంటారు. కానీ ఈ సినిమాలో ఓ యూనిక్ పాయింట్ ఉంటుంది. అదేంటో ఇప్పుడే చెప్పకూడదు. సినిమా చూసి తెలుసుకోవాల్సిందే' అని చెప్పింది శ్రీనిధి శెట్టి. ఆమె సిద్ధు జొన్నలగడ్డ సరసన ఓ నాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసుకదా' ఈ నెల 17న విడుదలకానుంది. నీరజా కోన దర్శకురాలు. ఈ సందర్భంగా గురువారం పాత్రికేయులతో ముచ్చటించింది శ్రీనిధిశెట్టి. యాక్షన్, రక్తపాతం ఉన్న కేజీఎఫ్, హిట్-3 వంటి చిత్రాల తర్వాత ఓ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ చేయడం సరికొత్త అనుభూతి అని చెప్పింది. ఈ సినిమాలో తాను రాగ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తన క్యారెక్టర్‌లో కొంచెం గ్రేషేడ్స్ కనిపిస్తాయని తెలిపింది. 'ఈ సినిమాలోని కొత్త పాయింట్ ప్రతీ ఒక్కరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. లవ్, ఎమోషన్స్, కామెడీ.. ఇలా అన్ని అంశాల కలబోతగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. సిద్ధు జొన్నలగడ్డకు సినిమాకు సంబంధించిన ప్రతి క్రాఫ్ట్‌పై అవగాహన ఉంది. ఆయన టైమింగ్ బాగుంటుంది. ఇక రాశీఖన్నా క్రమశిక్షణ కలిగిన నటి. తన ఆహారపు అలవాట్లు, వర్కవుట్స్ అన్నీ పద్ధతిగా ఉంటాయి' అని శ్రీనిధి శెట్టి పేర్కొంది. వెంకటేష్-త్రివిక్రమ్ సినిమా కథానాయికగా ఎంపికయ్యారనే వార్తలపై స్పందిస్తూ 'నిజంగా ఆ విషయం నాకు తెలియదు. ఆ సినిమా ఛాన్స్ రావాలని కోరుకుంటున్నా.




Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 12, Issu:103